ADVERTISING
నేటి దర్శిని తెలుగు దిన పత్రిక లో
ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 94920 33365

WWW.NETIDARSHINI.COM
# నేటి దర్శిని
RNI NO: TGTEL/25/A0471
తెలుగు దిన పత్రిక
సత్య శోధనే మా లక్ష్యం...
రంగారెడ్డి సోమవారం 30-03-2026 సంపుటి: 01 సంచిక : 283 వేల: 2 రూ పేజీలు :08 సంపాదకులు: కట్ట హిమ పావని
Ranga Reddy Monday 30-03-2026 Volume :01 Issue: 283 Cost: 2 Pages:08 Editor : Katta HimaPavani

రిపోర్టర్లు కావలెను
జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి
నేటి దర్శిని ఆహ్వానం పలుకుతుంది.
తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ,
మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా
పని చేయుటకు ఆసక్తి, అనుభవం
ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్
చేసి సంప్రదించగలరు.
Contact Number
9059328777



## అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్

- పాడి కౌశిక్‌రెడ్డిపై ఎథిక్స్ కమిటీకి సిఫారసు

హైదరాబాద్ మార్చి29 (నేటి దర్శిని

రాష్ట్ర శాసనసభ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సస్పెండ్ చేశారు. సభా కార్యక్రమాలను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అడ్డుకుంటున్నారనీ, వారిని సస్పెండ్ చేయాలని శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తీర్మానం ప్రవేశపెట్టారు. దీంతో కేటీఆర్, హరీశ్‌రావు సహా ఆపార్టీ ఎమ్మెల్యేలను రెండురోజులపాటు సస్పెండ్ చేస్తున్నట్టు స్పీకర్ ప్రకటించారు. సస్పెన్షన్‌కు గురైన వారిలో తలసాని శ్రీనివాస్‌యాద్, గుంతకండ్ల జగదీష్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, గంగుల కమలాకర్, మాధవరం కృష్ణారావు,

-మిగతా 2 లో

## టార్గెట్ అమెరికా!

- యూఎస్‌ను లక్ష్యంగా చేసుకునే క్షిపణికి ఇంజిన్ పరీక్ష
- కిమ్ పర్యవేక్షణలో నిర్వహించిన ఉత్తర కొరియా



సియోల్

మధ్యప్రాచ్యంలో ఉద్రిక్త పరిస్థితుల నడుమ నార్త్ కొరియా కీలక పరీక్షలు జరుపుతోంది. అమెరికా ప్రధాన భూభాగాన్ని లక్ష్యంగా చేసుకోగల సామర్థ్యం ఉన్న క్షిపణికి ఇంజిన్ టెస్ట్‌ను జరిపింది. ఉత్తర కొరియా నేత కిమ్ జోంగ్ ఉన్ పర్యవేక్షణలో అధిక శక్తి కలిగిన సాలిడ్-ఫ్యూయల్ ఇంజిన్ పరీక్ష జరిగింది. ఇది నార్త్ కొరియా వ్యూహాత్మక సైనిక సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ఒక ముఖ్యమైన ముందడుగు అని ఆ దేశ అధికారిక వార్తా సంస్థ కొరియన్ సెంట్రల్ న్యూస్ ఏజెన్సీ (కేసీఎన్ఏ) తెలిపింది. అమెరికా ప్రధాన భూభాగాన్ని చేరుకోగల క్షిపణుల ఆయుధాగారాన్ని విస్తరించడం, ఆధునీకరించడంపై కిమ్ దృఢసంకల్పంతో ఉన్నారని ఈ పరీక్ష సూచిస్తోందని విశ్లేషకులు చెప్తున్నారు. ఈ వార్తా సంస్థ వెల్లడించిన


-మిగతా 2 లో

## పొంగులేటీపై బీఆర్ఎస్ ఫైట్

### మంత్రి అక్రమాలపై రోజంతా అట్టుడికిన అసెంబ్లీ

- హౌస్ కమిటీకి పట్టు.. బీఆర్ఎస్ సభ్యుల సస్పెన్షన్
- సభను కుదిపేసిన పొంగులేటి సంస్థ అక్రమాలు
- స్పీకర్ పోడియం వద్దకు వెళ్లి సభ్యుల నినాదాలు
- నిరసన వేళ పెద్దఎత్తున మార్షల్స్ మోహరింపు
- అవినీతిపై సమాధానం చెప్పలేక అడ్డదారులు
- కౌశిక్ అంశంతో తప్పుదోవ పట్టించే యత్నం
- పట్టువీడని బీఆర్ఎస్.. 4 గంటలపాటు నిరసన
- చివరికి బీఆర్ఎస్ శాసనసభ్యుల సస్పెన్షన్
- ఈ సెషన్ ముగిసేవరకూ వర్తిస్తుందన్న స్పీకర్

విచారణ జరుపాలంటూ బీఆర్ఎస్ ఆందోళన





హైదరాబాద్, మార్చి29 (నేటి దర్శిని

బీఆర్ఎస్ సభ్యుల నిరసనలు, ఆందోళనలతో ఆదివారం అసెంబ్లీ అట్టుడికింది. 'పొంగులేటి కాదు.. పొంగు'లూటీ'.. 'మంత్రుల అవినీతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి'.. 'రక్షకుడే భక్షకుడైతే ప్రజలకు దిక్కెవరు?'.. 'అక్రమాల ఘనాపాటి మంత్రి పొంగులేటి'.. అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ బీఆర్ఎస్ సభ్యులు చేసిన నినాదాలతో సభ దద్దరిల్లింది. 'తల్లిదండ్రుల సంరక్షణ ఉద్యోగుల బాధ్యత' అన్న బిల్లుపై ఆదివారం

-మిగతా 2 లో

## గల్ఫ్ నుంచి భారత తీరంవైపు రెండు ఎల్పీజీ నౌకలు



2 లో



## కష్టకాలంలో అండగా నిలిచారు'..

- గల్ఫ్ దేశాలు చూపిన చొరవ మరువలేనిది
- గల్ఫ్ దేశాల ప్రజలకు ప్రధాని మోదీ కృతజ్ఞతలు

న్యూఢిల్లీ మార్చి29 (నేటి దర్శిని

పశ్చిమాసియా లో నెలకొన్న యుద్ధ వాతావరణంలో చిక్కుకుపోయిన భారతీయ పౌరులను సురక్షితంగా స్వదేశానికి తరలించడంలో సహాయం అందించిన గల్ఫ్ దేశాలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ధన్యవాదాలు తెలిపారు. కష్టకాలంలో భారతీయులకు అండగా నిలిచిన యూఏఈ సౌదీ అరేబియా ఖతార్, ఒమన్

-మిగతా 2 లో



## ఇరాన్‌కు షాక్..

- ఖర్గ్ ఐలాండ్‌ను స్వాధీనం చేసుకున్న అమెరికా
- ఇరాన్ ముడి చమురు ఎగుమతుల్లో దాదాపు 90 శాతం ఈ దీవి నుంచే
- ఈ మెరుపుదాడితో ఇరాన్ ఆర్థిక మూలాలను అమెరికా గట్టిగా దెబ్బ

న్యూఢిల్లీ

పశ్చిమాసియ లో యుద్ధ మేఘాలు మరింత దట్టంగా కమ్ముకుంటున్నాయి. ఇరాన్ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసేలా అమెరికా సంచలన చర్యకు దిగింది. ప్రపంచ చమురు రవాణాలో కీలకమైన హర్మూజ్ జలసంధి సమీపంలోని ఇరాన్ 'ఖర్గ్ ఐలాండ్' ను అమెరికా దళాలు తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. ఇరాన్ ముడి చమురు ఎగుమతుల్లో దాదాపు 90 శాతం ఈ దీవి నుంచే జరుగుతాయి. ఈ మెరుపుదాడితో ఇరాన్ ఆర్థిక మూలాలను అమెరికా గట్టిగా దెబ్బతీసినట్లయింది. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.అమెరికా వైమానిక, నౌకాదళాలు సంయుక్తంగా ఈ ఆపరేషన్‌ను పూర్తిచేసినట్లు సమాచారం. అంతేకాకుండా త్వరలో ఇరాన్ భూభాగంలోకి సైన్యాన్ని పంపేందుకు ట్రంప్ యంత్రాంగం సిద్ధమవుతోంది. ఇందుకోసం ఇప్పటికే పశ్చిమాసియాకు అదనపు బలగాలను తరలిస్తున్నట్లు నివేదికలు వస్తున్నాయి. అమెరికా నేరుగా ఇరాన్ గడ్డపైకి సైన్యాన్ని పంపాలని నిర్ణయించడం అంతర్జాతీయంగా కలకలం రేపుతోంది. గల్ఫ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలు, చమురు క్షేత్రాలపై ఇరాన్ అనుకూల వర్గాలు చేసిన దాడులకు ప్రతిగా అమెరికా ఈ కఠిన నిర్ణయం తీసుకుంది.మరోవైపు హర్మూజ్ జలసంధిని మూసివేస్తామని ఇరాన్ హెచ్చరించడంతో ఆ మార్గాన్ని తమ నియంత్రణలో ఉంచుకునేందుకు అమెరికా దళాలు భీకరంగా పోరాడుతున్నాయి. ఐక్యరాజ్యసమితి వంటి అంతర్జాతీయ సంస్థలు శాంతి చర్చల కోసం ప్రయత్నిస్తున్నప్పటికీ పరిస్థితులు పూర్తిస్థాయి యుద్ధానికి దారితీసేలా కనిపిస్తున్నాయి. ఒకవేళ హర్మూజ్ జలసంధి

-మిగతా 2 లో

## దళితులు పరిపాలన చేయొద్దా?

### వారి పట్ల ఇదేనా మీ వైఖరి

- అప్పుడు ఎస్సీని సీఎం చేస్తామన్నారు..మాట తప్పారు
- ఇప్పుడేమో దళితుడు స్పీకర్‌గా ఉన్నారు కాబట్టి సభకు రావటం లేదు : అసెంబ్లీలో బీఆర్ఎస్‌పై నిప్పులు చెరిగిన సీఎం రేవంత్‌రెడ్డి
- గులాబీ పార్టీ మంత్రాలకు చింతకాయలు రాలవంటూ ఎద్దేవా
- పొంగులేటి రాజీనామా కుదరదంటూ వ్యాఖ్య
- ఇక్కడ ఉన్నది రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క అంటూ హెచ్చరిక



హైదరాబాద్ మార్చి29 (నేటి దర్శిని

'దళితులు పరిపాలనలో భాగస్వాములు కాకూడదా? వారు పెద్ద పదవులు చేపట్టొద్దా? ఇదేనా వారి పట్ల మీ పార్టీ వైఖరి...' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధిస్తే దళితుడినే మొట్టమొదటి సీఎం చేస్తానని చెప్పిన ఆ పార్టీ అధినేత కేసీఆర్... ఇచ్చిన మాట తప్పారని ఎద్దేవా చేశారు. ఆనాడు అలా వ్యవహరించిన ఆయన... ఇప్పుడు శాసనసభ స్పీకర్‌గా దళితుడైన గడ్డం ప్రసాద్ కుమార్ ఉన్నారు కాబట్టే... అసెంబ్లీకి రావటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ఆదివారం సభలో బిల్లులపై చర్చ సందర్భంగా...

-మిగతా 2 లో



## అదరగొట్టిన రోహిత్, రికెల్టన్..

- కెకెఆర్‌పై ముంబయి ఇండియన్స్ 6 వికెట్ల తేడాతో ఘన విజయం
- ముంబై.. 13 ఏళ్ల తర్వాత ఆరంభ మ్యాచ్‌లో గెలుపు

ముంబయి -మార్చి29 (నేటి దర్శిని

ఐపిఎల్ 2026లో భాగంగా కెకెఆర్‌తో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో ముంబయి ఇండియన్స్ 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ముంబయి లోని వాంఖడే స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన కెకెఆర్ నిర్ణీత 20 ఓవర్లలో 4

-మిగతా 2 లో

## బెంగాల్‌లో ఫిష్ పాలిటిక్స్..



- బీజేపీ అధికారంలోకి వస్తే నాన్ వెజ్ తిననీయరన్న దీదీ..
- చేపలతో బీజేపీ నేతల ప్రచారం

న్యూఢిల్లీ మార్చి29 (నేటి దర్శిని

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో అధికార తృణముల్ కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ మధ్య తీవ్ర మధ్య తీవ్ర మాటల యుద్ధం నెలకొంది. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే మాంసాహారంపై నిషేధం విధిస్తారని.. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సహా టీఎంసీ నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ క్రమంలోనే ఇప్పుడు ఫిష్ పాలిటిక్స్ ఆ రాష్ట్రంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. బెంగాల్‌లో బీజేపీ గెలిస్తే.. చేపలు, గుడ్లను తినకూడని

-మిగతా 2 లో

## ఏప్రిల్ రెండో వారంలో ఇంటర్ ఫలితాలు

- ముగిసిన జవాబుపత్రాల మూల్యాంకనం
- ఏప్రిల్ 8,10,12 తేదీల్లో ఏదో ఒక రోజు ఫలితాలు విడుదల




హైదరాబాద్, మార్చి29 (నేటి దర్శిని

ఇంటర్ వార్షిక పరీక్షల ఫలితాలు ఏప్రిల్ రెండో వారంలో విడుదలకానున్నాయి. ఏప్రిల్ 8,10,12 తేదీల్లో ఏదో ఒక రోజు ఫలితాలు విడుదల చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఆయా తేదీల్లో ఫలితాల వెల్లడికి ప్రభుత్వ అనుమతి కోరారు. ఇంటర్ జవాబుపత్రాల మూల్యాంకనం ఆదివారంతో ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా

-మిగతా 2 లో

WWW.NETIDARSHINI.COM
RNI NO: TGTEL/25/A0471
తెలుగు దిన పత్రిక
సత్య శోధనే మా లక్ష్యం

# ఇరాన్‌కు షాక్..

మొదటి తరువాయి



ద్వారా చమురు సరఫరా నిలిచిపోతే ప్రపంచవ్యాప్తంగా పెట్రోల్ ధరలు భారీగా పెరిగే ప్రమాదం ఉందని విశ్లేషకులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

# అదరగొట్టిన రోహిత్, రికెల్టన్..

మొదటి తరువాయి



వికెట్ల నష్టానికి 220 పరుగులు చేయగా.. ముంబయి ఇండియన్స్ మరో 5 బంతులు మిగిలుండగానే (19.1 ఓవర్లలో) 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది రోహిత్ శర్మ (38 బంతుల్లో 78; 6 ఫోర్లు, 6 సిక్సర్లు), ర్యాన్ రికెల్టన్ (43 బంతుల్లో 81; 4 ఫోర్లు, 8 సిక్సర్లు) విధ్వంసకర అర్ధ శతకాలతో ముంబయి గెలుపును ఖరారు చేయగా.. ఆతర్వాత వచ్చిన సూర్యకుమార్ యాదవ్ (8 బంతుల్లో 16; 3 ఫోర్లు), తిలక్ వర్మ (14 బంతుల్లో 20; 4 ఫోర్లు), హార్దిక్ పాండ్యా (11 బంతుల్లో 18 నాటౌట్; 3 ఫోర్లు), నమన్ ధిర్ (2 బంతుల్లో 5 నాటౌట్; ఫోర్) మ్యాచ్‌ను లాంఛనంగా ముగించారు. కెకెఆర్ బౌలర్లలో వైభవ్ అరోరా, కార్తీక్ త్యాగి, సునీల్ నరైన్ తలో వికెట్ తీయగా.. రికెల్టన్‌ను అనుకూల్ రారు అద్భుతమైన డైరెక్ట్ త్రోతో రనౌట్ చేశాడు. అంతకుముందు రహానే (40 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్సర్ల సాయంతో 67 పరుగులు), ఫిన్ అలెన్ (17 బంతుల్లోనే 6 ఫోర్లు, 2 సిక్సర్ల సాయంతో 37 పరుగులు), అంగ్క్రిష్ రఘువంశీ (29 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సర్ల సాయంతో 51 పరుగులు), రింకూ సింగ్ (21 బంతుల్లో 4 ఫోర్ల సాయంతో 33 నాటౌట్) సత్తా చాటడంతో కేకేఆర్ భారీ స్కోర్ చేసింది. కేకేఆర్ ఇన్నింగ్స్‌లో కెమరూన్ గ్రీన్ (18) ఒక్కడే నిరాశపరిచాడు. ముంబై ఇండియన్స్ బౌలర్లలో శార్దూల్ ఠాకూర్ (4-0-39-3), ట్రెంట్ బౌల్ట్ (4-0-38-0) అద్భుతంగా బౌలింగ్ చేయగా..హార్దిక్ పాండ్యా ఓ వికెట్ తీశాడు.

## ఏప్రిల్ రెండో వారంలో

# ఇంటర్ ఫలితాలు

మొదటి తరువాయి




అన్ని క్యాంపుల్లో మూల్యాంకనం ముగియడంతో ఫలితాల క్రోడీకరణ పనుల్లో అధికారులు నిమగ్నమయ్యారు.అయితే ఈ సారి సమాధాన పత్రాల రీ వెరిఫికేషన్ చేయించనున్నారు. సింగిల్ సబ్జెక్టు ఫెయిలైన వారితోపాటు ఒక్కో సబ్జెక్టులో కొన్ని జవాబుపత్రాలను ర్యాండమ్‌గా వెరిఫికేషన్ చేయించనున్నారు. ఆ తర్వాత సీజీజీలో ట్రయల్స్ నిర్వహించి అంతా సవ్యంగా ఉంటేనే ఫలితాలు విడుదల చేస్తారు. వాస్తవానికి ఏప్రిల్ 6వ తేదీనే ఫలితాలు విడుదల చేయాలని భావించినా, బడ్జెట్ సమావేశాలు, ఇతర పనులతో రెండో వారానికి వాయిదావేశారు.

# టార్గెట్ అమెరికా!

మొదటి తరువాయి

సమాచారం ప్రకారం... ఈ పరీక్ష దేశం ఐదేండ్ల సైనిక విస్తరణ ప్రణాళికలో భాగంగా జరిగింది. ఈ ప్రణాళికలో ప్రధాన లక్ష్యం 'వ్యూహాత్మక దాడి సామర్థ్యాలను' అభివృద్ధి చేయడం. అంటే అణు సామర్థ్యం గల అంతర్మహాద్వీప క్షిపణులు (ఐసీబీఎంలు) తయారు చేయడం. ఈసారి పరీక్షించిన సాలిడ్-ఫ్యూయల్ ఇంజిన్ అత్యధిక థ్రస్ట్ 2500 కిలో టన్నులుగా నమోదైంది.

## అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్

# ఎమ్మెల్యేల సస్పెన్షన్

మొదటి తరువాయి

బండారు లక్ష్మారెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి, మాణిక్‌రావు, పద్మారావు, చింతా ప్రభాకర్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేష్, విజయుడు, కెపి వివేకానంద, అనిల్‌జాదవ్, కోవా లక్ష్మి ఉన్నారు. కడియం శ్రీహరిని తన హావభావాలతోపాటు బాడీ ల్యాంగేజ్ ద్వారా అవమానించినందుకు కఠిన చర్యలు తీసుకునేందుకు ఎథిక్స్ కమిటీకి సిఫారసుచేయాలంటూ సభ తీర్మానించింది. కాగా ఈ ప్రభుత్వంలో అసెంబ్లీ నుంచి గుంతకండ్ల జగదీష్‌రెడ్డి సస్పెండ్ కావడం ఇది రెండోసారి.

# దళితులు పరిపాలన చేయొద్దా?

మొదటి తరువాయి

బీఆర్ఎస్ సభ్యులు, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి సంబంధించిన దానిగా చెబుతున్న రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీ వ్యవహారంపై హౌస్ కమిటీకి పట్టుబట్టారు. స్పీకర్ పోడియం వద్దకు వెళ్లి ఆందోళనకు దిగారు. ఆ సందర్భంగా సీనియర్ సభ్యుడు కడియం శ్రీహరి మాట్లాడేందుకు ప్రయత్నించగా... బీఆర్ఎస్ సభ్యుడు పాడి కౌశిక్ రెడ్డి, ఆయన వైపు వేలు చూపుతూ.. రకరకాల సైగలు చేస్తూ బెదిరించినట్టుగా వ్యవహరించారు. ఆ సందర్భంగా సభలో పెద్ద దుమారం చెలరేగింది. ఈ దశలో జోక్యం చేసుకున్న సీఎం రేవంత్ రెడ్డి ప్రధాన ప్రతిపక్షంపై నిప్పులు చెరిగారు. బీఆర్ఎస్‌ను, ఆ పార్టీ అధినేత కేసీఆర్‌నుద్దేశించి ఘాటు వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ ఎల్పీ ఉపనేత హరీశ్‌రావు, ఆ పార్టీ సభ్యుడు కేటీఆర్‌ను ఉద్దేశించి పలుమార్లు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. తెలంగాణ వస్తే దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానని చెప్పిన కేసీఆర్... వారికి పరిపాలన చేయరాదని, అందువల్ల తానే సమస్యలను పరిష్కరిస్తానని అవమానించి ముఖ్యమంత్రి పదవి చేపట్టారని విమర్శించారు. ఎస్సీని ఉప ముఖ్యమంత్రి చేసిన ఆయన.. ఆ తర్వాత అతడిని కూడా బర్తరఫ్ చేశారన్నారు. 2018లో ఎస్సీల నుంచి కొప్పుల ఈశ్వర్ ఒక్కరికే మంత్రివర్గంలో చోటు కల్పించారని గుర్తు చేశారు. అప్పట్లో ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా దళితుడైన భట్టి విక్రమార్కను ఓర్వలేకపోయారని చెప్పారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలందర్నీ లాక్కుని అపోజీషన్ లీడర్ పదవి లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు తమ ప్రభుత్వంలో ఆయన ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా హరీష్‌రావు ఉండగా



మున్సిపల్ మంత్రిగా కేటీఆర్ ఉన్నారని వివరించారు. ఉప ముఖ్యమంత్రి హోదాలో భట్టి విక్రమార్క.. బడ్జెట్‌ను ప్రవేశపెడితే ఆయన్ను అవమానించేలా బీఆర్ఎస్ సభ్యులు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భట్టి విక్రమార్క, దామోదర రాజనర్సింహ, సీతక్క వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్, రామచంద్ర నాయక్, వేముల వీరేశం, అద్దంకి దయాకర్... ఇలా చెప్పుకుంటే పోతే ఎంతోమంది దళితులకు, ఆదివాసీలకు తమ ప్రభుత్వంలో పదవులు కల్పించామని చెప్పారు. ఇదీ తమ టీమ్ అని పేర్కొన్నారు. కానీ గతంలో కేసీఆర్ టీమ్‌లో హరీష్ రావు, కేటీ రామారావు, దయాకర్ రావు, వినోద్ రావు, కవితారావు, సంజరురావు... ఇలా అందరూ రావులే ఉన్నారంటూ ఎద్దేవా చేశారు. దళితులను చిన్నచూపు చూసే కేసీఆర్‌కు కనువిప్పు కలిగించేందుకే స్పీకర్‌గా గడ్డం ప్రసాద్‌కుమార్‌ను ఎన్నుకున్నామని తెలిపారు. ఈ క్రమంలో దళితుడిని మైక్ అడగాల్సి వస్తుందనే కాఉరణంతోనే కేసీఆర్ సభకు రావటం లేదని దెప్పిపొడిచారు. ఈ రకంగా బీఆర్ఎస్ నేతలు దళితులపట్ల తీవ్రమైన వివక్షను ప్రదర్శిస్తోందని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. 2014లో పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించి, ఇతర పార్టీల్లోంచి వచ్చిన వారికి మంత్రి పదవులిచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని ఎద్దేవా చేశారు. ఇప్పుడు అదే పార్టీ నేతలు ఫిరాయింపులపై మాట్లాడటం, సభలో గోల చేయటం విడ్డూరంగా ఉందన్నారు. ఆదాయాన్ని పెంచి పేదలకు పంచాలనే విధానంతో ముందుకు వెళు తున్నామని సీఎం ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. సంస్కరణల ద్వారా ప్రభుత్వ ఆదాయాన్ని పెంచుతున్నామని తెలిపారు. రాఘవ కన్‌స్ట్రక్షన్‌కు సంబంధించి 2025లో వాస్తవ పరిస్థితులు తెలుసుకుని మైనింగ్ శాఖ నోటీసులు ఇచ్చి పన్నులు రాబట్టిందని చెప్పారు.ఏ విషయంలోనైనా ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఇంత పారదర్శకంగా తాము తీసుకున్న చర్యలను అభినందిస్తే అధికారులు మరింత ఉత్సాహంగా పనిచేసేవారని అభిప్రాయపడ్డారు. రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీ వ్యవహారంపై హౌస్ కమిటీ వేయాలని డిమాండ్ చేయడం సరికాదన్నారు. బీఆర్ఎస్ హయాంలో మూడు హౌస్ కమిటీలు వేసి, బ్లాక్ మెయిల్ చేసి ఆస్తులు గుంజుకున్నారని వివరించారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించి రాజకీయ లబ్ది పొందారని వ్యాఖ్యానించారు. వారిలా హౌస్ కమిటీ వేసి రాజకీయ లబ్ది పొందాలని తాము భావించటం లేదన్నారు. అందుకే పదేండ్ల నుంచి ఇప్పటి వరకు జరిగిన ఖనిజ సంపద దోపిడీ, అక్రమ మైనింగ్‌పై సీబీసీఐడీ విచారణకు ఆదేశించామని తెలిపారు.

# బెంగాల్‌లో ఫిష్ పాలిటిక్స్..

మొదటి తరువాయి

పరిస్థితి తీసుకువస్తారని.. సీఎం మమతా బెనర్జీ ఆరోపణలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే దీదీ ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు బీజేపీ నేతలు.. చేపలను పట్టుకుని ఎన్నికల ప్రచారం చేస్తుండటం గమనార్హం. త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో కమలం పార్టీ అధికారంలోకి వస్తే.. బెంగాల్‌లో చేపలు సహా మాంసం, గుడ్లపై నిషేధం విధిస్తారని.. సీఎం మమతా బెనర్జీ గత కొన్ని రోజులుగా ప్రచారంలో ఇదే వ్యాఖ్యలు చేస్తున్నారు. అయితే దీదీ చేస్తున్న ప్రచారాన్ని దీటుగా బదులిచ్చేందుకు ప్రయత్నం చేస్తున్న బీజేపీ నేతలు.. ప్రచారంలో ఏకంగా చేపలను తీసుకుని తిరుగుతుండటం గమనార్హం.ఢిల్లీ నుంచి వచ్చే నాయకులకు బెంగాల్ సంస్కృతి అర్థం కాదని మమతా బెనర్జీ సంచలన ఆరోపణలు చేస్తున్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే మాంసాహారం తినడంపై ఆంక్షలు విధిస్తారని ఇటీవల చేస్తున్న ప్రచారంలో పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలోనే తాజాగా పురూలియాలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న దీదీ.. ఇదే విషయాన్ని మరోసారి గుర్తుచేశారు. దేశంలోని బీజేపీ పాలిత రాష్ట్రాల్లో చేపలు తినరని.. బెంగాల్‌లో కూడా ఆ పార్టీ అధికారంలోకి వస్తే బెంగాల్ ప్రజలు కూడా మాంసం, గుడ్లు తినలేని పరిస్థితి వస్తుందని దీదీ ఆరోపించారు.ఇటీవలె బిహార్ ఉప ముఖ్యమంత్రి విజయ్ కుమార్ సిన్హా కీలక వ్యాఖ్యలు చేశారు. బిహార్‌లోని విద్యా సంస్థలు, సంతలు, ప్రధాన రహదారులు సహా బహిరంగ ప్రాంతాల్లో మాంసం, చేపల విక్రయాన్ని నిషేధించాలని ప్రకటించారు. బిహార్ ప్రజల వ్యక్తిగత ఆహార అలవాట్లను తాము గౌరవిస్తామని.. అయినప్పటికీ.. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఈ బిహార్ విషయాన్నే దృష్టిలో పెట్టుకుని పదే పదే విమర్శలు చేస్తున్న మమతా బెనర్జీ.. బీజేపీ బెంగాల్‌లో అధికారంలోకి వస్తే ఇక్కడ కూడా అవే ఆంక్షలే పెడుతుందని ఆరోపిస్తున్నారు.చేపలు, మాంసం తాము కూడా తింటామని.. తమ పార్టీ బెంగాల్‌లో అధికారంలోకి వస్తే మాంసాహారంపై ఎలాంటి ఆంక్షలు విధించమని తేల్చి చెప్పారు. ఇక ఇదే విషయాన్ని స్పష్టం చేసిన బీజేపీ బెంగాల్ రాష్ట్ర అధ్యక్షుడు షామిక్ భట్టాచార్య కూడా స్పష్టం చేశారు. ఆహారపు అలవాట్లను బెంగాలీలు ఎప్పటికీ వదులుకోలేరని.. శాకాహారాన్ని ప్రోత్సహించే ఉద్దేశం బీజేపీకి లేదని తేల్చి చెప్పారు.

# పొంగులేటీపై బీఆర్ఎస్ ఫైట్

మొదటి తరువాయి

శాసనసభలో చర్చ సందర్భంగా రాఘవ కన్‌స్ట్రక్షన్స్ వ్యవహారంపై సభా సంఘం (హౌస్ కమిటీ) వేయాలని బీఆర్ఎస్ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్పీకర్ పోడియం వద్దకు చేరుకొని ఆందోళనకు దిగారు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని వెంటనే బర్తరఫ్ చేయాలని, మైనింగ్ వ్యవహారంలో హౌస్ కమిటీ వేయాలన్న డిమాండ్లతో చప్పట్లు కొడుతూ, నినాదాలు చేస్తూ సభలో నిల్చొని ఆందోళన కొనసాగించారు. ఈ సమయంలో పెద్ద ఎత్తున మార్షల్స్ స్పీకర్ పోడియం వద్ద మోహరించారు. వెల్‌లోకి వెళ్లేందుకు యత్నించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను మార్షల్స్ నెట్టివేశారు. మార్షల్స్ తీరుతో మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఇతర బీఆర్ఎస్ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ తలసాని శ్రీనివాస్‌యాదవ్, బీఆర్ఎస్ సభ్యులు వేముల ప్రశాంత్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, అనిల్ జాదవ్, కౌశిక్‌రెడ్డి నేలపై కూర్చొని నిరసన తెలిపారు.

హౌస్ కమిటీపై సీఎం, మంత్రుల తలోమాట

హౌస్ కమిటీ ఏర్పాటుపై డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు చేసిన ప్రకటనకు విరుద్ధంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన చేయడం చర్చనీయాంశంగా మారింది. హౌస్ కమిటీ ఆరోపణలున్న శాఖలో తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వానికి సూచనలు మాత్రమే చేస్తుందని మంత్రులు వివరించారు. హౌస్ కమిటీకి చర్యలు తీసుకొనే అధికారాలు లేవని వారు చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం ఇందుకు భిన్నంగా బాలానగర్ భూ బదలాయింపులపై హౌస్ కమిటీ వేసేందుకు సిద్ధమని అసెంబ్లీలో ప్రకటించడం గందరగోళానికి దారితీసింది. కేవలం కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే ఈ అంశాన్ని తెరపైకి తెచ్చారని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు.

బీఆర్ఎస్ హయాంలో భూ బదలాయింపులపై హౌస్ కమిటీ ప్రతిపాదనను లేవనెత్తగా.. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించిన ఎమ్మెల్యేలతో ప్రభుత్వం శాసనసభలో మాట్లాడించడం గమనార్హం. ఈ సందర్భంగా దానం నాగేందర్, కడియం శ్రీహరి బీఆర్ఎస్ హయాంలో జరిగిన భూ బదలాయింపులపై సీఎం సూచన మేరకు హౌస్ కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరిని ఉద్దేశించి నాలుగు పార్టీలు మారారంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి విమర్శించారు. కడియం శ్రీహరి చోర్ అంటూ పాడి కౌశిక్‌రెడ్డి సహా బీఆర్ఎస్ సభ్యులు నినాదాలు చేశారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ ఎమ్మె ల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తీవ్ర స్థాయిలో బెదిరింపులకు పాల్పడ్డారు

# గల్ఫ్ నుంచి భారత తీరంవైపు రెండు ఎల్పీజీ నౌకలు

**న్యూఢిల్లీ**

గల్ఫ్ ప్రాంత నుంచి రెండు భారీ ఎల్పీజీ క్యారియర్ లు సురక్షితంగా భారత తీరంవైపు వస్తున్నాయి. బీడబ్ల్యూ టీవైఆర్, బీడబ్ల్యూ ఈఎల్ఎమ్ అనే ఈ నౌకల్లో సుమారు 94 వేల మెట్రిక్ టన్నుల ఎల్పీజీ ఉంది. ఈ మేరకు ఆదివారం కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రిత్వ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. మంత్రిత్వ శాఖ వివరాల ప్రకారం.. బీడబ్ల్యూ టీవైఆర్ నౌక మార్చి 31న ముంబైకి, బీడబ్ల్యూ ఈఎల్ఎమ్ నౌక ఏప్రిల్ 1న న్యూమంగళూరుకు చేరుకోనున్నాయి.గల్ఫ్ ప్రాంతంలో పనిచేస్తున్న భారత నౌకలు, నావికుల భద్రతకు అన్ని రకాల చర్యలు తీసుకున్నామని, గత 24 గంటల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగలేదని ప్రభుత్వం స్పష్టంచేసింది. ప్రస్తుతం పశ్చిమ పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో 18 భారత నౌకలు, 485 మంది భారత నావికులు ఉన్నట్లు తెలిపింది. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ షిప్పింగ్.. నౌకల యజమానులు, భారత రాయబార కార్యాలయాలతో కలిసి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తోంది. ఇందుకోసం ఏర్పాటు చేసిన డీజీ షిప్పింగ్ కంట్రోల్ రూమ్ 24x7 పనిచేస్తోందని, ఇప్పటివరకు 942 మంది నావికులను సురక్షితంగా స్వదేశానికి తరలించడంలో సహాయపడిందని పేర్కొన్నది. భారత్‌లోని అన్ని ఓడరేవుల్లో కార్యకలాపాలు సాధారణంగానే కొనసాగుతున్నాయని, ఎక్కడా రద్దీ లేదని మంత్రిత్వ శాఖ వెల్లడించింది. విదేశాంగ శాఖ, ఇతర సముద్రయాన భాగస్వాములతో కలిసి నావికుల సంక్షేమం, నిరంతరాయ సముద్ర కార్యకలాపాల కోసం కృషి చేస్తున్నట్లు తెలిపింది.

# కష్టకాలంలో అండగా నిలిచారు'..

మొదటి తరువాయి


దేశాల నాయకత్వానికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఇరాన్-అమెరికా మధ్య ఉద్రిక్తతల కారణంగా విమాన సర్వీసులు నిలిచిపోయినప్పుడు వేలాదిమంది భారతీయులను తమ దేశాల మీదుగా స్వదేశానికి పంపేందుకు గల్ఫ్ దేశాలు చూపిన చొరవ మరువలేనిదని ప్రధాని మోదీ అన్నారు. ఈ సంక్షోభ సమయంలో దుబాయ్, అబుదాబీ, మస్కట్ విమానాశ్రయాలు భారతీయుల తరలింపునకు కీలక కేంద్రాలుగా మారాయి. ముఖ్యంగా ఇరాన్ నుంచి భారతీయులను ఒమన్ మీదుగా తీసుకొచ్చేందుకు ప్రత్యేక అనుమతులు మంజూరు చేయడం వారి సహకారానికి నిదర్శనమని పేర్కొన్నారు.గల్ఫ్ దేశాలతో భారత్‌కు ఉన్న బలమైన దౌత్య సంబంధాల వల్లే ఎలాంటి ఆటంకాలు లేకుండా వేలాది మందిని సురక్షితంగా తీసుకురాగలిగామని ప్రధాని మోదీ చెప్పారు. 'కష్టకాలంలో ఆదుకున్న గల్ఫ్ దేశాల నాయకులకు భారత్ ఎప్పటికీ రుణపడి ఉంటుంది' అని ప్రధాని పేర్కొన్నారు. అదేవిధంగా గల్ఫ్ ప్రాంతంలో నివసిస్తున్న లక్షలాది మంది భారతీయ కార్మికులు, వారి కుటుంబాల భద్రతను పర్యవేక్షిస్తున్న ఆయా దేశాల ప్రభుత్వాలకు కూడా ప్రధాని కృతజ్ఞతలు తెలిపారు.

# దుర్గా నగర్‌లో ఘనంగా సీతారాముల కళ్యాణం

- కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వేడుకలు
- శ్రీరామనవమి వేడుకల్లో భక్తుల సందడి
- భక్తులకు అన్నప్రసాద వితరణ









**కర్మన్ ఘాట్, మార్చి 29 (నేటి దర్శిని):** శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని చంపాపేట్ డివిజన్ పరిధిలోని దుర్గా నగర్ కాలనీలో సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. దుర్గా నగర్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి కాలనీ వాసులు, భక్తులు భారీగా హాజరై ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించారు. ఈ కళ్యాణ మహోత్సవంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వంగ జగన్నాథ్ రెడ్డి దంపతులు, ఉపాధ్యక్షులు సుబ్బారు సందీప్ కుమార్ దంపతులు కలిసి పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల మధ్య సీతారాముల కల్యాణం సంప్రదాయబద్ధంగా నిర్వహించబడగా, భక్తులు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు.కార్యక్రమం అనంతరం అన్నప్రసాద వితరణ చేపట్టారు. పెద్ద ఎత్తున భక్తులకు ప్రసాదాన్ని అందించగా, పాల్గొన్న వారందరూ సేవా కార్యక్రమాన్ని ప్రశంసించారు. ఈ వేడుకల ద్వారా కాలనీలో ఐక్యత, భక్తి భావం మరింత బలపడిందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దుర్గా నగర్ కాలనీ అధ్యక్షులు వంగ జగన్నాథ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి భూరం వెంకటేష్, అసోసియేట్ ప్రెసిడెంట్ పి. వెంకట్ రెడ్డి, ఉపాధ్యక్షులు ఎస్. సందీప్ కుమార్, పి. రామకృష్ణ చారి, బి. రవి, ప్రశాంత్ చారి, జాయింట్ సెక్రెటరీలు సతీష్ కుమార్, బి. శ్రీనివాస్ గుప్తా, ఎస్. ప్రభాకర్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీలు ఎం. ప్రదీప్ రెడ్డి, డి. వెంకటేశ్వర రెడ్డి, ట్రెజరర్లు బి. కిరణ్ కుమార్, కే. యాదగిరి రెడ్డి, వేణుగోపాల చారి, రామకృష్ణ చారి, పెద్ద ఎత్తున దుర్గా నగర్ కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అనాథ పిల్లలకు అల్పాహారం అందించిన కృష్ణ గోపాల్ సేవా సమితి








**ఎల్.బి.నగర్, మార్చి 29 (నేటి దర్శిని):** కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో అనాథ పిల్లల వసతి గృహంలో ఆదివారం అల్పాహార పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 240 మంది అనాథ పిల్లలకు పోషకాహారంతో కూడిన అల్పాహారం అందించి వారి ఆకలి తీర్చారు. ఈ సందర్భంగా కృష్ణ గోపాల్ సేవా సమితి అధ్యక్షుడు కపిల్ కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ, సమాజంలో ఉన్న అనాథ మరియు ఆర్థికంగా వెనుకబడిన పిల్లలకు ఆహారం అందించడం తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రతిరోజూ ఆహారాన్ని దానం చేసే కార్యక్రమాన్ని కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ సేవా కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లడంలో సమితి సభ్యులందరి సహకారం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి కుష్ అగర్వాల్‌తో పాటు సభ్యులు సిద్ధార్థ్ పాల్బం, పాకా సతీష్ యాదవ్, సునీల్ దరాడే, డోమలపల్లి సునీల్ మరియు సురేష్ ధవాలే పాల్గొని సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఓరుగల్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు జాతీయ గుర్తింపు....!




- పాలిటెక్నిక్ కళాశాలలో ప్లాటినం జూబ్లీ ఉత్సవాలు
- పాలిటెక్నిక్ కళాశాలలోని గ్రంథాలయంలో 25 వేల పుస్తకాలు

**ఉమ్మడి వరంగల్, మార్చి 29 (నేటి దర్శిని బ్యూరో):** వరంగల్ నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్లాటినం జూబ్లీ వేడుకలతో పాటు ,పూర్వ విద్యార్థుల సమ్మేళనం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిజిఎన్పిడిఎల్ సిఎండి కర్నాటి వరుణ్ రెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల 1955లో 120 మంది విద్యార్థులతో ప్రారంభమైంది. ప్రస్తుతం 1620 మంది విద్యార్థులకు విద్యాబోధన చేస్తూ, క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచింది. ఏడు దశాబ్దాలలో సుమారు 20 వేల మంది విద్యార్థులు ఇక్కడ సాంకేతిక శిక్షణ పొంది, ప్రస్తుతం దేశ విదేశాల్లోనే రాష్ట్ర సాంకేతిక రంగాల్లో ఉన్నత స్థానాల్లో రాణిస్తున్నారు. వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చదువుకున్న విద్యార్థులు దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ సంస్థల్లో ఉన్నత స్థానాల్లో పేరు ప్రఖ్యాతిగాంచారు. ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్సి, అధికారులు ,శాస్త్రవేత్తలు, రాజకీయ నాయకులు ఎదిగి కళాశాలకు కీర్తి తీసుకువచ్చారు. బీహెచ్ఈఎల్, హెచ్ఎఎల్, జెన్కో, ఎన్ పి డి సి ఎల్, హెచ్సీఎల్ ,డి ఆర్ డి ఓ ,ఇస్రో, ఐడిపీఎల్ వంటి సంస్థల్లో కీలక బాధ్యతలు నిర్వహించారు. ఈ ఈ కళాశాలలోని గ్రంథాలయంలో సుమారు 25 వేల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. ఎంసెట్, పాలిసెట్, ఐసెట్ ఈసెట్ ప్రవేశ పరీక్షలు కౌన్సిలింగ్ ప్రక్రియలు ఇక్కడే నిర్వహిస్తారు. అంతర్జాతీయ నాణ్యతా ప్రమాణాల ప్రకారం ఈ కళాశాలకు ఐఎస్ఓ గుర్తింపు లభించింది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బైరి ప్రభాకర్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు

# పిల్లల భద్రత.. డ్రగ్స్ కు అడ్డుకట్ట అంశంపై నేడు అవగాహన సదస్సు

- బాలానగర్ ఎస్సై లెనిన్




**మిడ్జిల్, మార్చి 29, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** బాలానగర్ మండలంలో.. 99 రోజుల..ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా.. నేడు (సోమవారం) బాలానగర్ మండలంలోని హైదరాబాదు ఈగల్ టీం వారు.. పిల్లల భద్రత డ్రగ్స్ కు అడ్డుకట్ట అంశంపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని బాలానగర్ ఎస్సై లెనిన్ తెలిపారు. ఈ అంశంపై నాలుగు గ్రామాలలో అవగాహన సదస్సు ఉంటుందన్నారు. అవగాహన సదస్సు సమయాలు ఇవే 1.ఉదయం 8 గంటల నుండి 9 గంటల వరకు ఉడిత్యాల 2.9:15 నిమిషాల నుండి 10:30 వరకు మోతీ ఘనపూర్ 3.10:45 నుండి 12 గంటల 15 నిమిషాల వరకు కేతిరెడ్డిపల్లి 4.12:30 నుండి బాలానగర్ మండల కేంద్రంలో నిర్వహణ. ఈ కార్యక్రమంలో మండలంలోని ప్రభుత్వ అధికారులు పాల్గొంటారని.. ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, ప్రజలు హాజరు కావాలన్నారు. బాలానగర్ ఎస్సై లెనిన్ సూచించారు.

# సింగంపల్లి లో సీఎం సహాయ నిధి చెక్కు పంపిణి...



**ఆమనగల్లు, మార్చి 29 (నేటి దర్శిని ప్రతినిధి);** ఆమనగల్లు మండల పరిధిలోని సింగంపల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ ఆమనగంటి హేమలత నరసింహ ఆదివారం లబ్ధిదారులకు చెక్కును అందించారు. కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో పిట్టల లలిత కు సీఎం సహాయ నిధి కింద 35000 రూపాయల చెక్కును సింగంపల్లి గ్రామ మాజీ సర్పంచ్ హేమలత నరసింహ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో గ్రామ ప్రజలతో కలిసి,ఈ చెక్కును వారికి అందజేయడం జరిగింది.

తెలుగు దిన పత్రిక RNI NO: TGTEL/25/A0471
www.epaper.netidarshini.com
సోమవారం 30-03-2026

## సంపాదకీయం

# ఆనతినీయవా! ప్రభూ!




"నేను ఖమ్మం భారతమ్మ గారి దుకాణంలో నెలవారి సరుకులు కొనుక్కుంటాను. దయచేసి అనుమతి ఇవ్వగలరు. భవదియుడు-సీతారాం". ఇది నిన్న ఫేస్‌బుక్‌లో కవి మిత్రుడు పెట్టిన సాదాసీదా పోస్టు. దీనికి లైక్‌కొడుతూ "నేను కరుణ మెడికల్స్‌లో మందులు ఈ వారానికి కొనుక్కోవాలి. అనుమతించండి" అని కామెంట్ పెట్టాను.కొందరికి ఈ పోస్టు అంతరార్థం అర్థం కాలేదు.కొందరు ఇట్టే పసికట్టేసారు. 146కోట్ల ప్రజల ఆత్మగౌరవంపై ఎక్కుపెట్టిన అస్త్రం అది. ఒక దేశం పరువుకు సంబంధించిన సమస్య. ఇంతకన్న వ్యంగ్యంగా కవి ఏం వివరించగలడు! ఎంత బాధను అవేదనను కడుపులో దాచుకుంటే ఆ మాటలు పెల్లుబుకాయి. ఇంతకన్న దీనంగా ఏం దేబురించగలడు! జరుగుతున్న సంఘటనలు, పరిణామాలు, ఎవరినీ కదిలించడం లేదేమీ! మనుషులు, దేశ ప్రజలు, బుద్ధిజీవులు ప్రతిస్పందించడం మానుకున్నారా? నాకెందుకులే అని ఊరుకుంటున్నారా! ఇంతకన్న దారిద్ర్యం ఏముంది! సిగ్గుపడేలా చేస్తున్న ఈ దిగజారుడుతనం తలవంపులు కలిగించడం లేదూ! తూటాలకు కూడా వెరవకుండా వందేమాతరం అంటూ మూడు రంగుల జెండాను పైకెగరేస్తూనే ప్రాణాలు వొదిలిన త్యాగధనుల నేల వారసత్వమేనా ఇంత దిగజారింది! స్వేచ్ఛ కోసం, స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన వీరులగన్న గడ్డ, ఆ పౌరుషత్వాన్ని ఎందుకు, ఎలా కోల్పోయింది. మాట్లాడితే యాభై అరించుల ఛాతీగల ధైర్యంగా చెప్పుకున్న వాళ్లు, గొంతులోంచి చిన్నమాటను ఉపయోగించడం లేదెందుకు! వాడు పబ్లిక్‌గానే రష్యాదగ్గర, ఇరాన్ దగ్గర చమురు కొనవద్దన్నప్పుడూ ఒక్కమాట పెగల్లేదు. దానికి బదులుగా నా దగ్గరే కొనాలని హుకుం జారీచేసినా, తల ఊపాం తప్ప, ఏమీ మాట్లాడలేదు. ఇప్పుడు యుద్ధ సందర్భంగా, ఒక నెలరోజులు మీకు వెసులుబాటు కలిపిస్తున్నాను.రష్యా దగ్గర కొనుక్కోండి అని నెలరోజుల స్వాతంత్ర్యాన్ని ప్రకటించినపుడూ, డూడూ బసవన్నలా ఊపేసాం. మేము ఫలానా దేశం దగ్గర కొనుక్కుం టాము. మాకు అనుమతి ఇవ్వండి అనీ అర్జీ పెట్టుకోవడం ఏం తెలియజేస్తున్నది! మన డబ్బులు, మన స్వతంత్ర దేశం, సార్వభౌమ దేశం, ఎవరినుంచి కొనాలన్నా ట్రంపుగారి అనుమతి పొందాలి. ఈ సందర్భాన్ని కవి ఎంత సూటిగా, ముఖం మీద కొట్టినట్టు చెప్పాడు. అయిననూ మనవాళ్లకు చలనం కలిగిందా, ఏమో! రవి అస్తమించని సామ్రాజ్యవాదాన్ని గడగడలాడించి తరిమికొట్టిన అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్, సుభాష్ చంద్రబోస్, కొమురంభీమ్, ఆజాద్ చంద్రశేఖర్ లాంటి యోధానుయోధుల వీరచరితగల దేశం అమెరికా ఆజ్ఞలకు తలవంచడం, మనదేశ స్వాతంత్ర్య సార్వభౌమత్వాలను కోల్పోవడం కాదా! ప్రజలు, ప్రాంతాలు, జాతులు, మతాలు ఎన్ని రకాలుగా ఉన్నప్పటికీ, వైవిధ్యాలతో కొనసాగినప్పటికీ స్వేచ్ఛ కోసం పోరాడుతుంటే, వారికి కూడా సంఘీభావంగా నిలిచి, మద్దతు ప్రకటించిన అలీన ఉద్యమాన్ని నడిపిన, నాయకత్వం వహించిన దేశంగా పేరు పొందిన వాళ్లం మనం. ఇప్పుడు అమెరికా, ఇజ్రాయిల్, అంతర్జాతీయ చట్టాలకు, న్యాయసూత్రాలకు వ్యతిరేకంగా ఇరాన్‌పై దాడులు చేస్తుంటే, ఇది సరికాదు, అని చెప్పలేకపోయాం. కనీసం మనకు ఎప్పటినుంచో స్నేహితుడు అయిన ఇరాన్ నేతను హత్యచేస్తే, ఖండించడం అటుంచి, సంతాపమూ వెంటనే ప్రకటించలేని అసహాయ, అమానవీయస్థితికి దిగజారిపోయాం. 165 మంది చిన్నపిల్లలను అతి దారుణంగా బాంబులేసి చంపేసినా చలించకపోవడం, ఖండించకపోవడం ఎంత అన్యాయం! రెండు వందల యేండ్లు సామ్రాజ్యవాదంతో పోరాడిన వారసత్వం, నేడు ప్రపంచాన్ని యుద్ధ బీభత్సంలోకి దింపిన సామ్రాజ్యవాద అమెరికాకు సాగిలపడటం ప్రభుత్వ వైఫల్యానికి, లొంగుబాటుకు నిదర్శనం. ఎందుకీ లొంగుబాటు! ఈ నాయకుల రహస్య చిట్టాలేమయినా ట్రంపు తన చేతిలో పెట్టుకుని ఉన్నాడా! ఎప్‌స్టీన్ ఫైల్స్‌లోని నిజా నిజాలు ఇంకా బయటపడాల్సి ఉంది. 'హతులెవరో తెలుసు, హంతకులెవరో తెలుసు, అయినా, అన్యాయం అని అనకపోవడమే అసలు నేరం! కదా! అపార దేశ భక్తిగల వాళ్లు మనల్ని పరిపాలిస్తున్నారని ప్రజలు భ్రమపడుతున్నారు. దేశాన్ని నిర్లజ్జగా అగ్రరాజ్య ఆజ్ఞలకు తలొగ్గడం ప్రత్యక్షంగా చూస్తున్నాము. ఇంతటి వెన్నెముక లేని దేశంగా గతంలో ఎప్పుడూ లేదు. ఇప్పటికయినా ప్రజలు అప్రమత్తమయి, ఈ విధానాలకు వ్యతిరేకంగా ప్రతిస్పందించాల్సి ఉంది. లేదంటే స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు కోల్పోతాము.

# నాటి పల్లె జీవన సౌందర్యం... నేటి తరానికి మధుర జ్ఞాపకాల సందేశం"

హైదరాబాద్, మార్చి29 (నేటి దర్శిని డెస్క్)
ఒకప్పుడు పల్లెల్లో జీవనం సహజసిద్ధంగా, ఆరోగ్యవంతంగా, ఆనందభరితంగా సాగేదని, నేటి యాంత్రిక జీవనంతో పోల్చితే ఎంతో భిన్నంగా ఉండేదని వృద్ధులు, సామాజికవేత్తలు భావిస్తున్నారు. ధనం తక్కువైనా ధాన్యం సమృద్ధిగా ఉండే ఆ కాలంలో ప్రజలు ప్రకృతితో మమేకమై జీవించేవారని వారు గుర్తుచేస్తున్నారు. అప్పుడు ఎటు చూసినా కొర్రలు, రాగులు, వరిగలు, గోధుమలు, సజ్జలు, జొన్నలు వంటి మెట్ట పంటలతో పొలాలు కళకళలాడేవి. పంట కంకులపై పిట్టలు వాలి ఆహారం తీసుకోవడం సహజ దృశ్యంగా ఉండేది. వాటిని కాపాడేందుకు కాపరులు ఎత్తైన మంచెలపై నిలబడి రాళ్లు విసురుతూ కాపలా కాస్తుండేవారు. రసాయనాలు లేని ఆహారం, చేతిపని ద్వారా తయారైన ధాన్యం ప్రజలకు ఆరోగ్యాన్ని అందించేది. ఇళ్లలో బియ్యాన్ని రోకలి, రోకళ్ళతో దంచి, చాటలో చెరిగి, మళ్లీ పొట్టు వేరు చేసి సిద్ధం చేసుకునే ప్రక్రియ కుటుంబ సభ్యులంతా కలిసి చేసే పనిగా ఉండేది. ఆ బియ్యం రుచికి ఇప్పటి పాలిష్ చేసిన బియ్యం సరితూగదని వృద్ధులు చెబుతున్నారు. తౌడు, తౌడు ముద్దలు వంటి ఆహారాలు పంచభక్ష పరమాన్నాల కంటే రుచిగా ఉండేవని వారు పేర్కొంటున్నారు. గ్యాస్ స్టౌలు లేని ఆ రోజుల్లో మట్టి పొయ్యిలపై వంటలు చేసేవారు. ఉదయం తొలికోడి కూయగానే లేచి ఇంటి పనులు ప్రారంభించేవారు. గోవుల పేడతో ముంగిట శుభ్రపరచి, ముగ్గులు వేయడం, పొయ్యి రాళ్లకు పసుపు కుంకుమతో పూజలు చేయడం ఆచారంగా ఉండేది. కుండలో వండిన అన్నం, గంజి వంచి రాతి పలకపై పెట్టి చల్లార్చి తినడం ప్రత్యేకమైన సంప్రదాయం. ఆహారంలో సహజత్వం స్పష్టంగా కనిపించేది. పొలాల నుంచి తీసుకొచ్చిన గోంగూర, దోసకాయ, మిరపకాయలతో రోకలిబండపై నూరిన పచ్చళ్ళు, జొన్న సంకటి, రాగి సంకటి వంటి వంటకాలు రోజువారీ భోజనంలో భాగంగా ఉండేవి. మట్టి గిన్నెల్లో తినడం వల్ల తక్కువ ఆహారంతోనే తృప్తి కలిగేదని పెద్దలు చెబుతున్నారు.నీటి విషయంలో కూడా కుండలలో నిల్వ చేసిన చల్లని నీళ్ల





ఆరోగ్యానికి మేలు చేసేవి. నేటి ఫ్రిజ్ నీళ్లతో పోలిస్తే అవి మరింత శ్రేయస్కరమని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ లేని రాత్రుల్లో కిరోసిన్ దీపాలు, దివిటీలు వెలిగించి కుటుంబ సభ్యులు కలిసి ముచ్చట్లు చెప్పుకుంటూ గడిపే సంతోషం ప్రత్యేకంగా ఉండేది. సామాజిక సంబంధాలు కూడా బలంగా ఉండేవి. పాలు, పెరుగు, వెన్న వంటి పదార్థాలను పొరుగువారితో పంచుకోవడం, కూలి వృత్తుల వారికి సహాయం చేయడం సాధారణంగా ఉండేది. పండగలు, పెళ్లిళ్లు ఉమ్మడి కుటుంబంతో కలిసి ఘనంగా జరుపుకోవడం, ఆకులలో వడ్డించే వంటకాల రుచి ఇప్పటికీ మరచిపోలేనిదిగా వృద్ధులు గుర్తుచేస్తున్నారు. ఆ కాలంలో ఆరోగ్యం బలంగా ఉండేదని, వందేళ్ల వయసులో కూడా శక్తివంతంగా జీవించేవారని చెబుతున్నారు. నేటి తరంలో అయితే తక్కువ వయసులోనే ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సహజ ఆహారం, కష్టపడి పని చేయడం వల్లే అప్పటి ఆరోగ్యం సాధ్యమైందని వారు విశ్లేషిస్తున్నారు. అలాగే, ఆయుర్వేద వైద్యానికి అప్పట్లో ప్రాధాన్యత ఉండేదని, చిన్న చిన్న వ్యాధులకు సహజ చికిత్సలే సరిపోతాయని చెబుతున్నారు. నేటి వైద్య విధానాలతో పోలిస్తే అప్పటి వైద్యం విశ్వసనీయంగా ఉండేదని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం యాంత్రిక జీవనం, ఫాస్ట్ ఫుడ్ అలవాట్లు, సంబంధాల్లో మార్పులు సమాజాన్ని ప్రభావితం చేస్తున్నాయని, పాత జీవన విలువలను కొంతైనా ఆచరించడం అవసరమని వృద్ధులు సూచిస్తున్నారు. పల్లె సంస్కృతి, సహజ జీవన విధానం నేటి తరానికి ఆదర్శంగా నిలవాలని కోరుతున్నారు.

నేటి దర్శిని రిపోర్టర్ మురళీ బచ్చలి కూర
9912897793

# సంక్షోభంలో కాశ్మీర్ ఎంఎస్‌ఎంఈలు

శ్రీనగర్ మార్చి29 (నేటి దర్శిని
కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన కొత్త సేకరణ విధానాల కారణంగా జమ్మూ కాశ్మీర్‌లో చిన్న పరిశ్రమల రంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. కొత్త నిబంధనల అమలుతో చిన్న పరిశ్రమల అభివృద్ధి సంస్థ (ఎస్ఐసిఒపి) ద్వారా జరిగే ప్రభుత్వ సేకరణలు పెద్ద ఎత్తున నిలిచిపోయాయి. దీంతో వేలాది యూనిట్లు, లక్షలాది కుటుంబాల జీవనోపాధి ప్రమాదంలో పడింది. కేంద్రపాలిత ప్రాంతంలో సాధారణ ఆర్థిక నిబంధనలు (జిఎఫ్ఆర్) 2017 అమల్లోకి వచ్చిన తరువాత, ప్రభుత్వ కొనుగోళ్లు తప్పనిసరిగా ఈ-టెండర్ విధానం ద్వారా నిర్వహించాల్సి వచ్చింది. ముఖ్యంగా పోర్టల్ ద్వారా మాత్రమే కొనుగోళ్లు జరగాలనే నిబంధన ఎస్ఐసిఒపి కార్యకలాపాలకు పెద్ద దెబ్బతీసింది. ఈ మార్పుల ప్రభావంతో ఎస్ఐసిఒపిపై ఆధారపడిన సుమారు 5,000 చిన్న పరిశ్రమల యూనిట్లు నేరుగా దెబ్బతిన్నాయి. ఈ యూనిట్లపై ఆధారపడిన మూడు లక్షల మందికి పైగా ప్రజల జీవనోపాధి సంక్షోభంలోకి నెట్టబడింది. ఎస్ఐసిఒపి అందించే మార్కెటింగ్ మద్దతు లేకపోవడంతో పాటు, సంస్థకు వచ్చే ఆదాయ వనరులు కూడా గణనీయంగా తగ్గిపోయాయి.సీపీఐ(ఎం) నాయకుడు, కుల్గాం ఎమ్మెల్యే మహమ్మద్ యూసుఫ్ తరిగమి అడిగిన ప్రశ్నకు సమాధానంగా ప్రభుత్వం ఈ విషయాలను వెల్లడించింది. కొత్త విధానాల అమలుకు ముందు సామాజిక-ఆర్థిక ప్రభావాలపై ఎలాంటి అధ్యయనం చేయలేదని కూడా ప్రభుత్వం అంగీకరించింది. ప్రస్తుతం ఎస్ఐసిఒపి తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటోంది. ప్రభుత్వ గ్రాంట్లు లేకపోవడంతో ఉద్యోగులకు జీతాలు, ఇతర ప్రయోజనాలు చెల్లించడం కష్టంగా మారింది. సంస్థను కాపాడేందుకు పునరుద్ధరణ ప్రణాళిక సిద్ధం చేసినప్పటికీ, దాని అమలు పై స్పష్టత లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఉద్యోగుల భద్రత, చిన్న పరిశ్రమల స్థిరత్వం కోసం ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలిస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. కేంద్రీకృత డిజిటల్ వ్యవస్థల వైపు మార్పు స్థానిక పరిశ్రమలపై తీవ్ర ప్రభావం చూపుతోందని ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి.


Ministry of Micro, Small and Medium Enterprises, Government of India
MSME
MICRO, SMALL & MEDIUM ENTERPRISES
सूक्ष्म, लघु एवं मध्यम उद्यम

# నేపాల్‌లో కొనసాగుతున్న 'మాజీ మంత్రుల' అరెస్టులు

ఖాట్మాండు మార్చి29 (నేటి దర్శిని
నేపాల్‌లో అరెస్టుల పర్వం కొనసాగుతోంది. గతేడాది సెప్టెంబర్‌లో జెన్‌జెడ్ నిరసనల కారణంగా తలెత్తిన అల్లర్లు, ఘర్షణల్లో నిర్లక్ష్యపూరితమైన హత్యలకు పాల్పడ్డారన్న అభియోగాలపై నేపాల్ మాజీ ప్రధాని కె.పి.శర్మ ఓలి, మాజీ హోంమంత్రి రమేష్ లేఖక్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు. రాష్ట్రీయ స్వతంత్ర పార్టీకి చెందిన బాలేంద్ర షా నేతృత్వంలోని కొత్త ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే ఈ అరెస్టులు చోటు చేసుకున్నాయి. తాజాగా నేపాల్ మాజీ ఇంధన శాఖ మంత్రి దీపక్ ఖడ్కాను ఆదివారం అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. మనీలాండరింగ్ కేసు దర్యాప్తులో భాగంగా దీపక్ ఖడ్కాను ఈ ఉదయం అరెస్ట్ చేసినట్లు సిబిఐ ప్రతినిధి మీడియాకు వెల్లడించారు. నేపాల్ మనీలాండరింగ్ దర్యాప్తు విభాగం ఈ విచారణను



పర్యవేక్షిస్తోందని అన్నారు. సెప్టెంబర్ 9వ తేదీన నిరసనల సందర్భంగ ఖడ్కా నివాసం నుండి స్వాధీనం చేసుకున్న నగదుకు సంబంధించిన దర్యాప్తులో భాగంగా ఆదివారం ఉదయం ఆయనను అదుపులోకి తీసుకున్నారని కొత్త హోం వ్యవహారాల మంత్రి తన ఫేస్‌బుక్ పోస్ట్‌లో తెలిపారు. సెప్టెంబర్ 8,9 తేదీల్లో జరిగిన నిరసనల అణచివేతలో సుమారు 76మంది మరణించినట్లు అల్లర్లపై ఏర్పాటైన విచారణ కమిషన్ పేర్కొంది. నిరసనకారులు పార్లమెంట్ భవనం సహా ప్రభుత్వ కార్యాలయాలకు నిప్పుపెట్టారు. ఖడ్కా నివాసానికి నిప్పుపెట్టడంతో పాటు ఆయన నివాసంలో దొరికిన నగదును నిరసనకారులు గాల్లోకి విసిరిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గామారిన సంగతి తెలిసిందే.



మిడ్జిల్ మండలంలోని వస్పుల గ్రామంలో తన సోదరి నూతన గృహప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి వర్యులు డాక్టర్ సి.లక్ష్మారెడ్డి,మాజీ ఎంపీపీ సుదర్శన్ బరిగెల,మండల పార్టీ అధ్యక్షులు పాండు యాదవ్, మాజీ సర్పంచ్ మధుసూదన్ రెడ్డి,శ్రీ ఆకాష్ జూనియర్ కాలేజ్, చైతన్ భారతి హై స్కూల్ కరస్పాండెంట్ యాజమాన్యం వై.రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు..
(నేటి దర్శిని ప్రతినిధి) మిడ్జిల్

# ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన





**ఇబ్రహీంపట్నం ప్రతినిధి, మార్చి 29(నేటిదర్శిని):** ఇబ్రహింపట్నం నియోజకవర్గం ఆదిబట్ల మున్సిపాలిటీ కేంద్రంలో అదిబట్ల మున్సిపాలిటీ మాజీ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డిగారి ఆధ్వర్యంలో శ్యామ్ హాస్పిటల్ వారి సౌజన్యంతో మెగా హెల్త్ క్యాంప్ విజయవంతంగా నిర్వహించారు. ఈ హెల్త్ క్యాంప్‌ను మర్రి నిరంజన్ రెడ్డి ప్రారంభించారు. ఈ క్యాంప్‌లో ప్రముఖ జనరల్ ఫిజిషియన్, దయాబెటాలజిస్ట్, క్లినికల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ శ్యామ్,డాక్టర్ రంగరాజ్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ రాఘవేంద్ర, ఆర్థోపెడిక్స్, కార్డియాలజీ వంటి ప్రముఖ వైద్యులచే సేవలు అందించారు. ఈసీజీ, 2డి ఎకో టెక్నీషియన్లు, వివిధ రకాల బ్లడ్ టెస్టులు నిర్వహించి, సుమారుగా 300 మందికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం మర్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. ముందుగా రోగులను పలకరించి వారి ఆరోగ్య పరిస్థితులను ఆరా తీశారు. ప్రస్తుతం మానవుల జీవన శైలి ఆహారపు అలవాట్లలో మార్పుల కారణంగా ప్రజలు అనేక రోగాల బారిన పడుతున్నారని తెలిపారు. ఏ ఒక్క చిన్న రుగ్మత ను అజాగ్రత్తగా చూడకుండా ముందుగానే వైద్య పరీక్షలు చేయించుకోవడం మంచిదన్నారు. అలాగే మర్రి నిరంజన్ రెడ్డి శ్యామ్ హాస్పిటల్ డాక్టర్ల బృందం, వైద్యులు, టెక్నీషియన్లు,నర్సులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమం లో భూపతిగల్ల మహిపాల్ (మాజీ జడ్పీటీసీ), కోరె కలమ్మ (మాజీ వైస్ చైర్మన్), లావణ్య పాండురంగారెడ్డి (కౌన్సిలర్), జమ్మ శ్రీశైలం( పిఎసిఎస్ చైర్మన్), మాజీ వార్డ్ సభ్యులు, గ్రామ పెద్దలు, యువజన సంఘాల నాయకులు, మున్సిపాలిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్‌లో 3,416 కేసుల పరిష్కారం

● సైబర్ బాధితులకు 42,97,445/- నగదు తిరిగి అందజేసిన మహబూబ్‌నగర్ జిల్లా పోలీసులు"




**మిడ్జిల్, మార్చి29 (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో పెండింగ్ కేసుల పరిష్కారంలో విశేష ఫలితాలు సాధించబడినట్లు జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపిఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా వివిధ కోర్టుల పరిధిలో ఉన్న మొత్తం 3,416 కేసులు పరిష్కరించబడినట్లు పేర్కొన్నారు. వాటిలో: ఐపీసీ (IPC) కేసులు -- 524 డీడీ (DD) కేసులు -- 794 ఈపెట్టీ (e-Petty) కేసులు -- 1,979 సైబర్ క్రైమ్ కేసులు -- 119 ఈ కేసుల పరిష్కారంతో బాధితులకు తక్షణ న్యాయం అందించడంతో పాటు, కోర్టులపై ఉన్న భారం కూడా తగ్గినట్లు ఎస్పీ వెల్లడించారు. జాతీయ లోక్ అదాలత్ ద్వారా వివాదాలను స్నేహపూర్వకంగా, వేగవంతంగా పరిష్కరించుకోవడం వల్ల ప్రజలకు సమయం, ధనం ఆదా అవుతుందని ఆమె పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ప్రజలు ఈ విధమైన అవకాశాలను వినియోగించుకోవాలని కోరారు. ఈ విజయవంతమైన కార్యక్రమానికి సహకరించిన న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీసు అధికారులు, సిబ్బంది మరియు సంబంధిత శాఖలందరికీ జిల్లా ఎస్పీ అభినందనలు తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు శాఖప్రజా భద్రత -- పోలీసు బాధ్యత

# దీన్ దయాళ్ బాటలో వెలుగుల భారత్

● బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్






**ఉమ్మడి వరంగల్, మార్చి 29 (నేటి దర్శిని బ్యూరో):** పండిట్ దీన్ దయాళ్ తాత్విక సిద్ధాంతాల పునాదుల మీద ఈరోజు స్వశక్తి, స్వదేశీ, స్వాభిమానం, స్వాలంబనలతో భారత్ ప్రపంచంలోనే నాలుగు ఆర్థిక శక్తిగా ఎదిగిందని బిజెపి వరంగల్ జిల్లా అధ్యక్షులు గంటా రవికుమార్ తెలిపారు.పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్ కార్యక్రమం వరంగల్ జిల్లా కాశీబుగ్గ మండలంలో ఆదివారం మండల అధ్యక్షులు అపురూప రజినిష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి వరంగల్ జిల్లా అధ్యక్షులు గంటా రవి కుమార్ పాల్గొని మాట్లాడుతూ పార్టీ కార్యకర్తల్లో సైద్ధాంతిక స్పష్టత, సంస్థాగత బలోపేతం, ప్రజలతో మమేకం కావడం వంటి పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఆలోచనలను ప్రజల్లోకి తీసుకెళ్లడం పై మార్గదర్శనం చేశారు.భారత ప్రభుత్వం పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఇంటిగ్రల్ హ్యూమనిజం ఫిలాసఫీ ఆధారంగా ఆత్మనిర్భర్ భారత్, అంత్యోదయ భావనలతో సుమారు 740 సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. సైద్ధాంతిక భూమిక కాలాంశంలోభాగంగా కార్యకర్తలతో ప్రసంగిస్తూ మానవుని శరీరం, మనస్సు, బుద్ధి , ఆత్మల కలయికగా పరిగణించే ఒక సమగ్ర దృక్పథం అన్నారు. పాశ్చాత్య పెట్టుబడిదారీ విధానం, సామ్యవాదం రెండింటికీ ప్రత్యామ్నాయంగా భారతీయ మూలాలతో కూడిన ఏకాత్మ మానవతవాదం పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రతిపాదించారని తెలియజేశారు. సమాజంలో చిట్టచివరి వరుసలో ఉన్న వ్యక్తికి కూడా అభివృద్ధి ఫలాలు అందాలనేదే అంత్యోదయ సిద్ధాంతం యొక్క ముఖ్య ఉద్దేశం అని పేర్కొన్నారు. ఈ సిద్ధాంతం నిరుపేదల అభ్యున్నతికి ప్రాధాన్యత ఇస్తుందని వివరించారు. అలాగే కార్యకర్తలలో పార్టీ సిద్ధాంతాల పట్ల స్పష్టతను పెంపొందించడం, దేశాభివృద్ధిలో భారతీయత మరియు సాంస్కృతిక జాతీయవాదం యొక్క ప్రాముఖ్యతను వివరించడం ఈ శిక్షణా తరగతుల ప్రధాన లక్ష్యం, భారతీయ సంస్కృతి, విలువల ఆధారంగా దేశాన్ని బలోపేతం చేయడం , స్వదేశీ ఆర్థిక నమూనాను ప్రోత్సహించడం వంటి అంశాలపై ఈ మహాభియాన్ దృష్టి సారిస్తుందని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ నోముల రతన్, జిల్లా నాయకులు ఎరుకల రఘునారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శిలు బొడ్డు రాకేష్, మామిడాల సతీష్, బీజేపీ సీనియర్ నేతలు సిద్దోజు శ్రీనివాస్, అల్లి అజయ్, సాంబరాజు ప్రభాకర్, రాఘవాచారి, ముచర్ల ప్రభాకర్, గుర్రపు సత్యనారాయణ, పగడాల సుదర్శన్, భవాని శంకర్, మడిపెల్లి నాగరాజు, కందుకూరి శ్రీనివాస్, దీప ఠాగూర్ , మండల, డివిజన్ల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రానున్న రోజుల్లో మునుగోడు నియోజకవర్గం ఎడారిగా మారుతుంది

● మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్




**చండూరు,మార్చి29 (నేటి దర్శిని):** చండూర్ మున్సిపల్ మునుగోడు మాజీ ఎమ్మెల్యే బిఆర్ఎస్ పార్టీ కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి... వివరాల్లోకి వెళితే శ్రీశైలం నుండి ఎదుల్ల వద్ద నీటి పంపకాలలో మునుగోడు నియోజకవర్గం లోని లక్ష్మాపురం, శివన్నగూడెం ప్రాజెక్టులకు అన్యాయం జరగబోతుంది ఏదుల్ల వద్ద మనకు 0.5 టిఎంసిలకు 436 అడుగుల వద్ద రెగ్యులేటర్ని ఏర్పాటు చేస్తే కొంతవరకు న్యాయం జరగవచ్చు అలా కాకుండా 440 మీటర్ల వద్ద రెగ్యులేటర్ ఏర్పాటు చేసి టన్నెల్ ద్వారా నీటిని పంపించాలని ప్రభుత్వం జీవో విడుదల చేసింది. దీని ద్వారా మునుగోడు నియోజకవర్గానికి అన్యాయం జరగబోతుందని మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అన్నారు . పంపకాల్లో ప్రభుత్వం సమతుల్యం పాటించాలని అదేవిధంగా వేలకోట్ల రూపాయలు ఖర్చుపెట్టి డిండి, శివన్నగూడెం, లక్ష్మాపురం ప్రాజెక్టు నిర్మించి నీళు రానప్పుడు ఈ ప్రాజెక్టుల యొక్క వ్యయం వృధా అవుతుందని స్థానిక ఎమ్మెల్యే దీనిపై దృష్టి సారించి ప్రభుత్వంతో కొట్లాడి 436 మీటర్ల వద్ద రెగ్యులేటర్ని ఏర్పాటు చేస్తే కొంతవరకు న్యాయం జరుగుతుందని మునుగోడు ప్రజల తరఫునుండి ఎమ్మెల్యే కి చేతులు జోడించి వేడుకుంటున్నానని మునుగోడుకు అన్యాయం జరగవద్దని దీనికోసం ఎన్ని పోరాటాలైన చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి సంబంధిత మంత్రుల దగ్గరికి వెళ్లి అడగాలని కోరారు. తనకు సొంత కాంట్రాక్టుల కోసం మంత్రి పదవి పై ఉన్న శ్రద్ధ ఇక్కడి ప్రజలపై పరిపాలనపై లేదని నీధులు ఉన్నప్పటికీ మునుగోడు అభివృద్ధికి నోచుకోవడం లేదని ఎద్దేవా చేశారు.

## ఆకట్టుకున్న విద్యార్థుల సంస్కృతిక వేడుకలు







**నాగోల్, మార్చి29 (నేటి దర్శిని):** స్లోక ద గ్లోబల్ స్కూల్ వారు వార్షికోత్సవ వేడుకలు నాగోల్ లోని ఓ ఫంక్షన్ హాల్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల ఆటపాటలు అధ్యంతం వినోద భరితంగా సాగాయి. సాంప్రదాయ ఆటపాటలు, మైథాలజికల్ , సంస్కృతిక, కార్యక్రమాలు చూపర్ల లను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో స్లోక ద గ్లోబల్ స్కూల్ సంస్థల అధినేత జయపాల్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశాంత పత్రాలను, మెడల్స్ ను అందజేశారు. సందర్భంగా శ్లోక విద్యాసంస్థల చైర్మన్ జైపాల్ రెడ్డి మాట్లాడుతూ... మా విద్యా సంస్థల యందు నాణ్యమైన విద్యతోపాటు సంస్కృతి, సాంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. ఈ వార్షికోత్సవ వేడుకలను ఇంత గొప్పగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయిని ఉపాధ్యాయులకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకల్లో నాగోల్, అల్మాస్గూడ, మాదాపూర్ కోకాపేట్ ఇస్నాపూర్ బ్రాంచ్ల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్లోక విద్యాసంస్థల సీఈవో అంజన శ్రీ మాట్లాడుతూ... నాగోల్ లో ప్రారంభించిన మొదటి సంవత్సరంలోనే స్లోక విద్యా సంస్థ దిగ్విజయంగా విజయం సాధించిందని పేర్కొన్నారు. విద్యార్థులకు ప్రదర్శించిన శ్రీనివాస కళ్యాణం, నరసింహ అవతార స్కిట్ చూపర్లను ఆకట్టుకుందనేమో పేర్కొన్నారు. ఈ వేడుకలను ఇంత విజయం సాధించడానికి కృషి చేసిన ఉపాధ్యాయులకు విద్యార్థులకు ఆమె ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ బ్రాంచ్ల ప్రిన్సిపాల్ లు, డైరెక్టర్లు,, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అన్నపూర్ణ కాలనీ కమిటీ భవన్ ప్రారంభించిన ఎంపీ ఈటల రాజేందర్



**బోడుప్పల్, మార్చి 29 (నేటి దర్శిని):** బోడుప్పల్‌లోని అన్నపూర్ణ కాలనీ సంక్షేమ సంఘం కమిటీ భవన్‌ను మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కాలనీ వాసులు, స్థానిక నాయకులు భారీ సంఖ్యలో హాజరై ఎంపీకి ఉత్సాహభరిత స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ, కాలనీల అభివృద్ధిలో సంక్షేమ సంఘాల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను చర్చించి, పరిష్కార మార్గాలను కనుగొనే వేదికగా ఈ కమిటీ భవనం ఉపయోగపడుతుందని అన్నారు. సమాజంలో ఐక్యత, పరస్పర సహకారం పెంపొందించడంలో ఇలాంటి సంఘాలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని ఆయన వివరించారు. మల్కాజిగిరి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి తాను ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానని, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రటరీ శ్రీనివాస్, బోడుప్పల్ అధ్యక్షులు మహేష్, సీనియర్ నాయకులు ఆనంద్, పద్మతో పాటు ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు, కాలనీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కొండల్ని పిండేస్తున్న కంకర క్రషర్లు..
# గుట్టలపై మాఫియా పంజా!

- అధికారుల నిర్లక్ష్యంతో పెరుగుతున్న అక్రమ దందా
- ఇండ్ల నిర్మాణం, రోడ్ల పనులపై భారీ ప్రభావం
- వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్



**మిర్యాలగూడ, మార్చి 29 (నేటి దర్శిని):** నల్గొండ జిల్లా సహా ఉమ్మడి జిల్లాలైన సూర్యాపేట, భువనగిరి ప్రాంతాల్లో కంకర క్రషర్ మిల్లర్ల అక్రమాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. కొండగుట్టలను తవ్వి కంకరగా మార్చే ఈ మిల్లర్లు ఇప్పుడు ధరల విషయంలో కూడా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మైనింగ్ శాఖ నుండి ఎలాంటి అధికారిక ఆదేశాలు లేకపోయినా, కంకర ధరలను అమాంతం పెంచి సాధారణ ప్రజలపై భారం మోపుతున్నారు. గతంలో టన్నుకు రూ.400 ఉన్న 20 ఎంఎం కంకరను ప్రస్తుతం రూ.1000 వరకు విక్రయిస్తుండగా, టన్నుకు రూ.500 ఉన్న డస్ట్‌ను రూ.800కి పెంచి అమ్ముతున్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు, సీసీ రోడ్ల పనులు, మిర్యాలగూడ ప్రాంతంలో రైల్వే లైన్ పనుల కోసం కంకర, డస్ట్‌కు అధిక డిమాండ్ ఉండటాన్ని అవకాశంగా చేసుకుని మిల్లర్లు ఈ దందాకు పాల్పడుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో నిర్మాణ వ్యయాలు పెరిగి సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక కొండగుట్టల తవ్వకాల పేరుతో పర్యావరణానికి కూడా ముప్పు ఏర్పడుతున్నదని స్థానికులు చెబుతున్నారు. అక్రమ మైనింగ్‌తో ప్రకృతి సంపద దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత మైనింగ్, రెవెన్యూ అధికారులు స్పందించి కంకర మిల్లు యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అక్రమ ధరల నియంత్రణతో పాటు కొండల తవ్వకాలపై కట్టడి చేయాలని కోరుతున్నారు.

# ప్రజా ప్రతినిధులు క్రీడల్లో పాల్గొనడం ద్వారా సమాజంలో క్రీడా స్ఫూర్తి పెంపొందుతుంది:ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజ్

- ఎల్బీ స్టేడియంలో క్రికెట్, వాలీబాల్‌లో క్రీడా పోటీల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



**ఉమ్మడి వరంగల్, మార్చి 29 (నేటి దర్శిని బ్యూరో):** ప్రజా ప్రతినిధులు క్రీడల్లో పాల్గొనడం ద్వారా సమాజంలో క్రీడా స్ఫూర్తి పెంపొందుతుందని ఉమ్మడి వరంగల్ జిల్లా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజ్ అన్నారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహిస్తున్న “ఫస్ట్ ఎడిషన్ ఆఫ్ తెలంగాణ లెజిలేటర్స్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ మీట్ 2026” కార్యక్రమంలో ఆదివారం ఉమ్మడి వరంగల్ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి వాలీబాల్, క్రికెట్ పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అద్భుతమైన బ్యాటింగ్, బౌలింగ్ ప్రదర్శిస్తూ అందర్నీ ఆశ్చర్యపరిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ క్రీడా కార్యక్రమాలు ఆరోగ్యకరమైన జీవన విధానానికి దోహదపడటమే కాకుండా పరస్పర స్నేహభావాన్ని కూడా పెంచుతాయని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రీడలను ప్రోత్సహించే విధంగా అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ స్పోర్ట్స్ మీట్ ద్వారా ప్రజల్లో క్రీడలపై ఆసక్తి మరింత పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ చేసిన టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్

**వనస్థలిపురం, మార్చి29 (నేటి దర్శిని):** వనస్థలిపురం డివిజన్ చెందిన వెంకయ్య మరియు రామ చారి ఇటీవల ఆస్పత్రిలో చేరి చికిత్స పొందడం జరిగింది.. వనస్థలిపురం డివిజన్ అధ్యక్షులు కుట్ల నర్సింహ యాదవ్ దృష్టికి రావడంతో వారు టీపీసీసీ ప్రచారా కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ కి చెప్పగానే వారు స్పందించి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా 1. వెంకయ్య గారికి 60,000/- రూపాయిల చెక్కు, 2.రామాచారికి 60,000/- రూపాయిల చెక్కులు మంజూరు చేయించారు. అలాగే ఉమ్మడి చింతలకుంట డివిజన్ పరిధిలోని నూకల కృష్ణ మోహన్ గారికి 5 లక్షల రూపాయల ఎల్.ఓ.సి చికిత్స నిమిత్తం సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం డివిజన్ అధ్యక్షులు కుట్ల నర్సింహ యాదవ్,ఎల్బీనగర్ మహిళా అధ్యక్షురాలు స్వర్ణ మాధవి, కర్మాన్ ఘాట్ హనుమాన్ టెంపుల్ డైరెక్టర్ కవిత తదితరులు పాల్గొనారు



# జాతీయ లోక్-అదాలత్ కు అపూర్వ స్పందన

- 4868 కేసుల్లో విజయవంతంగా రాజీ
- సైబర్ నేరగాళ్ల చేతిలో కోల్పోయిన రూ: 1.42 కోట్లు తిరిగి బాధితులకు అందేలా కోర్ట్ ఆదేశాలు
- జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బందిని ప్రశంసించిన ఎస్పీ





**నారాయణఖేడ్,మార్చి 29 (నేటి దర్శిని):** శనివారం జరిగిన జాతీయ లోక్-అదాలత్ ను ఉద్దేశించి జిల్లా ఎస్పీ పంకజ్ పరితోష్ ఆదివారం ఒక ప్రకటనలో మాట్లాడుతూ..జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీసు స్టేషన్లలో నమోదైన,చాలా కాలంగా పెండింగ్ లో ఉన్న,రాజీ పడటానికి అవకాశం ఉన్నటువంటి 717 -- ఐపిసి కేసులలో ఇరు వర్గాలను రాజీ కుదర్చడం జరిగిందని,2722- ఇ-పెట్టి,1429 - డిడి కేసులలో అడ్మిషన్/ జరిమాన విధించడం జరిగింది అన్నారు. సైబర్ నేరాలకు సంభందించి జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన 73 సైబర్ క్రైమ్ కేసులలో రూ,1.32 కోట్లు, ఎఫ్ఐఆర్ లేకుండా 88 కేసులలో రూ,10.83 లక్షల రూపాయలను తిరిగి సైబర్ బాధితులకు ఇప్పించేందుకు కోర్ట్ నుండి అనుమతి పొందడం జరిగింది అన్నారు.క్షణికావేశంలో చేసే తప్పులను సరిదిద్దుకోవాడానికి లోక్-అదాలత్ అనేది ఒక మంచి అవకాశం అని,అనవసర గొడవలకు పోయి జీవితాలను ఇబ్బందులపాలు చేసుకోకూడదని అన్నారు.రాజీ మార్గమే రాజా మార్గం అని,రాజీ పడటం ద్వారా ఇరువర్గాలు సమఉజ్జులుగా ఉంటారని,రాజీ కుదుర్చుకోవడానికి అవకాశం ఉన్న అన్ని కేసులల్లో ఇరు వర్గాలు రాజీపడవచ్చు అన్నారు. 2021లో సంగారెడ్డి మహిళా పోలీస్ స్టేషన్‌లో నమోదైన వరకట్న వేధింపుల కేసులో భార్యాభర్తల మధ్య ఉన్న విభేదాలను పరిష్కరించి, ఐదేళ్లుగా కొనసాగుతున్న సమస్యకు జాతీయ లోక్-అదాలత్ ద్వారా ముగింపు పలికారని,మురళి--శ్రీలేఖ దంపతులను మళ్లీ ఏకం చేసి కుటుంబాన్ని కలపడం జరిగింది అన్నారు.ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా పోలీసులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.జిల్లా పోలీసుల అత్యుత్తమ పనితీరును కొనియాడుతూ, ప్రజలకు త్వరితగతిన న్యాయం అందించడంలో చూపిన కట్టుబాటు, సమన్వయం,సేవా భావం ప్రశంసనీయమని పేర్కొన్నారు.ఇలాంటి అద్భుతమైన ప్రదర్శనతో జిల్లా పోలీస్ శాఖ ప్రజల్లో విశ్వాసాన్ని మరింత బలపరిచిందని ఎస్పీ గర్వంగా తెలిపారు.జాతీయ లోక్-అదాలత్ ను విజయవంతం చేసిన అధికారులు పి.పిలు, వర్టికల్ డిఎస్పీ సురేందర్ రెడ్డి, ఇన్స్పెక్టర్ రమేష్, ఐ4జ- డిఎస్పీ వేణుగోపాల్ రెడ్డి, ఇన్స్పెక్టర్ రవి, లైజనింగ్ అధికారి కె.సత్యనారాయణ ఎస్ఐ,కోర్ట్ డ్యూటీ అధికాలు,సైబర్ సెల్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

# శాసనసభలో రాజగోపాల్ రెడ్డి ఆగ్రహం

- “ఎమ్మెల్యేలకు నిధులు లేవా?”
- సొంత ప్రభుత్వంపైనే మండిపడ్డ మునుగోడు ఎమ్మెల్యే



**మునుగోడు, మార్చి 29 (నేటి దర్శిని):** శాసనసభలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మరోసారి తన సొంత ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలకు సరైన నిధులు కేటాయించడం లేదని, ఇది ఏ విధమైన పాలన అని ప్రశ్నిస్తూ సభలో ఘాటు వ్యాఖ్యలు చేశారు. “ఎమ్మెల్యేలకు నిధులు ఇవ్వలేని ప్రభుత్వం ఇదేం దిక్కుమాలిన ప్రభుత్వం?” అంటూ ఆయన విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన కొడంగల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకున్నట్లే, ఇతర ఎమ్మెల్యేలు కూడా తమ నియోజకవర్గాలను అభివృద్ధి చేసుకోవాలనే ఆకాంక్ష సహజమని పేర్కొన్నారు. అలాగే భట్టి విక్రమార్క మధిర నియోజకవర్గానికి, ఉత్తమ్ కుమార్ రెడ్డి హుజూర్‌నగర్ నియోజకవర్గానికి ప్రాజెక్టులు తరలిస్తున్నారని, కానీ ఇతర ప్రాంతాల పట్ల నిర్లక్ష్యం చూపుతున్నారని ఆరోపించారు. “వట్టి చేతులతో కూర్చునే గోపాల్‌ను కాదు, నిధులను సాధించే రాజగోపాల్ రెడ్డిని” అంటూ తనదైన శైలిలో స్పందించారు. ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో పనులు చేసినా బిల్లులు క్లియర్ చేయడం లేదని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వం అంటే కేవలం ముఖ్యమంత్రి, మంత్రులు మాత్రమే కాదని, ఎమ్మెల్యేలు అందరూ కలిసే ప్రభుత్వం అవుతుందని స్పష్టం చేశారు. నిధుల కోసం ముఖ్యమంత్రి, మంత్రుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఎందుకు రావాలని ప్రశ్నించిన రాజగోపాల్ రెడ్డి, నియోజకవర్గాల మధ్య వివక్ష లేకుండా సమానంగా నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

# శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో సంపూర్ణ భగవద్గీత శ్లోకాలు పారాయణం



**ఉమ్మడి వరంగల్, మార్చి 29 (నేటి దర్శిని బ్యూరో):** వరంగల్ నగరంలోని శ్రీ బాలానగర్ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం సాయంత్రం శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్రం ,సంపూర్ణ భగవద్గీత 700 శ్లోకాలు భక్తులు పారాయణం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అర్చకులు ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయం చైర్మన్ గోవిందరాజులు, అధికారులు ,అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

# ఆంధ్ర బ్యాంక్ ఎంక్లవ్‌లో మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డికి ఘన సన్మానం





**హయత్ నగర్, మార్చి 29 (నేటి దర్శిని):** ఉమ్మడి హయత్ నగర్ డివిజన్ పరిధిలోని ఆంధ్ర బ్యాంక్ ఎంక్లవ్ కాలనీలో ఆదివారం హర్షాతిరేక వాతావరణంలో మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డికి కాలనీవాసులు ఘన సన్మానం నిర్వహించారు. కాలనీ అభివృద్ధికి ఆయన అందించిన సేవలను గుర్తిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, రోడ్ల నిర్మాణం, మంచినీటి సమస్యల పరిష్కారం వంటి అనేక కీలక అంశాల్లో నవజీవన్ రెడ్డి చేసిన కృషి విశేషమని కొనియాడారు. ప్రజల సమస్యలపై వెంటనే స్పందిస్తూ ఎల్లప్పుడూ అందుబాటులో ఉండడం ఆయన నాయకత్వానికి నిదర్శనమని తెలిపారు. ఇలాంటి ప్రజాహిత దృక్పథం కలిగిన నాయకత్వం కాలనీ అభివృద్ధికి ఎంతో అవసరమని పేర్కొంటూ, భవిష్యత్తులో కూడా ఇదే సేవా భావంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. సన్మానానికి స్పందించిన కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ, కాలనీవాసులు చూపిన ప్రేమాభిమానాలు తనపై ఉన్న బాధ్యతను మరింత పెంచాయని అన్నారు. కాలనీ అభివృద్ధిని తన కర్తవ్యంగా భావిస్తూ, ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేస్తానని తెలిపారు. ప్రజల విశ్వాసమే తనకు ప్రేరణ అని, రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి కాలనీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. తనపై నమ్మకం ఉంచి సన్మానం చేసిన ప్రతి ఒక్కరికీ ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు జయ శంకర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు సుమన్, జాన్ రెడ్డి, బాల్ రాజ్ గౌడ్ తదితరులు, పెద్ద సంఖ్యలో కాలనీవాసులు పాల్గొన్నారు.

# బీజేపీ గెలిస్తే చేపలు, గుడ్లు తినలేరు..

- ఎన్నికల వేళ మమత సంచలన వ్యాఖ్యలు



**న్యూఢీల్లీ మార్చి 29 (నేటి దర్శిని):** పశ్చిమ బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికల వేడి మొదలైంది. ఇప్పటికే అధికార టీఎంసీ, ప్రతిపక్ష బీజేపీ మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. తాజాగా టీఎంసీ అధినేత, సీఎం మమతా బెనర్జీ బీజేపీపై సంచలన వ్యాఖ్యలు చేశారు. బీజేపీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే ప్రజలు చేపలు, గుడ్లు తినలేరని వ్యాఖ్యానించారు. పురులియాలో ఆదివారం జరిగిన ఎన్నికల ప్రచారంలో మమత ఈ వ్యాఖ్యలు చేశారు.బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ప్రజలు చేపలు తినడం లేదు. బీజేపీ అధికారంలోకి వస్తే ప్రజలు చేపలు, మాంసం, గుడ్లు తినలేరు. మీరందరూ మీ మతాల్ని అనుసరిస్తారు. కానీ, బీజేపీ వాళ్లంతా ఒకేవైపు ఉంటారు. ఇతర మతాల మీద వారికి నమ్మకం లేదు. ధర్మం అంటే మానవత్వం అని శ్రీకృష్ణుడు చెప్పాడు. పని చేయడం ధర్మం. మంచి కోసం పని చేయడమే ధర్మం. కానీ, అల్లర్లు చేయడం, అమాయకుల్ని చంపడం ద్వారా బీజేపీ అధికారంలోకి రావాలని చూస్తోంది. అందులోనూ బీజేపీ పాలిత రాష్ట్రాల్లో గిరిజనులు, మహిళలపైనే అధిక దాడులు జరుగుతున్నాయి. బీజేపీ అధికారంలో ఉన్న ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లలోనే దాడులు ఎక్కువగా జరుగుతున్నాయి. పని కోసం వేరే ప్రాంతాలకు వెళ్లి బెంగాలీ మాట్లాడేవారిపై ఇతర రాష్ట్రాల్లో దాడులు జరుగుతున్నాయి. కానీ, మేం ఎవరినీ అణచివేయం. టీఎంసీ అంటే శాంతి, మానవత్వం, అందరినీ గౌరవించడం.ప్రజలతో కలిసి పని చేయడం" అని మమత వ్యాఖ్యానించారు. బెంగాల్‌ను ధ్వంసం చేయడానికి ప్రయత్నిస్తే బీజేపీ కేంద్రంలో అధికారం కోల్పోతుందని ఆమె అంతకుముందు అన్నారు. బెంగాల్‌లో నాలుగోసారి వరుసగా అధికారం చేపడితే, అన్ని పార్టీలతో కలిసి ఢిల్లీని ఆక్రమిస్తామని మమత హెచ్చరించారు. బీజేపీ బెంగాల్‌లో అధికారంలోకి వస్తే వాళ్లు ఇక్కడ బుల్డోజర్లు వాడుతారని విమర్శించింది. ఎన్నికల సంఘం కూడా బీజేపీ కోసమే పని చేస్తుందని మమత ఆరోపించింది. వచ్చే నెలలో బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే.

# రెండు స్థానాల నుంచి బరిలోకి టీవీకే చీఫ్ విజయ్



**న్యూఢీల్లీ మార్చి 29 (నేటి దర్శిని):** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాజకీయ సమీకరణాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. నటుడు విజయ్ స్థాపించిన 'తమిళగ వెట్రి కళగం పార్టీ సంచలన నిర్ణయం తీసుకుంది. ఏప్రిల్ 23న జరగనున్న ఎన్నికల్లో మొత్తం 234 నియోజకవర్గాల్లో ఒంటరిగా పోటీ చేయనున్నట్లు ప్రకటించింది. పార్టీ అధినేత విజయ్ స్వయంగా రెండు స్థానాల నుంచి బరిలోకి దిగుతున్నారు.విజయ్ తన పూర్తి పేరు 'సి. జోసెఫ్ విజయ్' పేరుతో నామినేషన్ వేయనున్నారు. చెన్నైలోని పెరంబూర్ మధ్య తమిళనాడులో పట్టుకోసం తిరుచిరాపల్లి ఈస్ట్ నియోజకవర్గాల నుంచి ఆయన పోటీ చేయనున్నారు. తమ అభ్యర్థులను 'మక్కల్ కాప్పాలర్గల్' గా అభివర్ణించిన విజయ్ వారు రాజకీయ నాయకులు కాదని, ప్రజల్లో ఒకరని తెలిపారు. ఈ ఎన్నికల్లో ప్రధాన పోరు తమ పార్టీకి, డీఎంకే కూటమికి మధ్యే ఉంటుందని ఆయన ధీమా వ్యక్తంచేశారు పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ చెన్నైలోని టీ నగర్ నుంచి ప్రచార విభాగం నేత ఆదవ్ అర్జున విల్లివాక్కం నుంచి పోటీ చేయనున్నారు. మాజీ మంత్రి కేఏ సెంగోట్టయన్ గోబిచెట్టిపాళయం నుంచి బరిలో ఉన్నారు. ఈ సందర్భంగా విజయ్ పలు కీలక హామీలను ప్రకటించారు. తమిళనాడును డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చడం, 29 ఏళ్లలోపు నిరుద్యోగ యువతకు నెలవారీ ఆర్థిక సాయం, ప్రభుత్వ నియామకాల్లో పారదర్శకతకు ప్రత్యేక చట్టం, విద్యార్థులకు రూ.20 లక్షల వరకు పూచీకత్తు లేని రుణాలు అందిస్తామని హామీ ఇచ్చారు. మార్చి 30 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానుండగా విజయ్ నిర్ణయంతో డీఎంకే, ఏఐఏడీఎంకే కూటముల్లో రాజకీయ వేడి పెరిగింది.


# భారీ క్షిపణి ఇంజిన్ పరీక్షించిన
# ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్..

- అమెరికాను చేరుకోగల సామర్థ్యం



**న్యూఢీల్లీ మార్చి 29 (నేటి దర్శిని):** అమెరికా లక్ష్యంగానే ఉత్తర కొరియా తన ఆయుధాల్ని రూపొందిస్తుందనే సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా అధునాతన ఆయుధాల్ని ఉత్తర కొరియా సమకూర్చుకుంటోంది. తాజాగా, అధిక సామర్థ్యం కలిగిన క్షిపణుల ఫ్యుయెల్ ఇంజిన్‌ను ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్ పరీక్షించాడు. దేశ సైనిక వ్యూహాత్మక శక్తి, సామర్థ్యాల్ని పెంచే లక్ష్యంతో ఈ క్షిపణుల ఇంజిన్‌ను ఉత్తర కొరియా తయారు చేసింది.ఆయుధ సామర్థ్యాన్ని విస్తరించడం, మిస్సైల్స్ శక్తిని పెంచడంలో భాగంగా ఇప్పుడు కొత్త క్షిపణుల్ని ఉత్తర కొరియా తయారు చేసినట్లు అక్కడి అధికార మీడియా సంస్థ అయిన కొరియన్ సెంట్రల్ న్యూస్ ఏజెన్సీ (కేసీఎన్ఏ) ప్రకటించింది. దీని ప్రకారం తాజాగా పరీక్షించిన క్షిపణికి అమెరికాను చేరుకోగల సామర్థ్యం ఉంది. ఇది నేరుగా అమెరికా భూభాగంపై దాడి చేయగలదు. తాజాగా ప్రయోగించిన క్షిపణి కార్బన్ ఫైబర్ మెటీరియల్‌తో తయారైంది. దీని ఇంజిన్ 2,500 కిలో టన్స్ పవర్ కలిగి ఉంది. గత సెప్టెంబర్‌లో ప్రయోగించిన క్షిపణి ఒకటి 1,971 కిలో టన్స్ సామర్థ్యం కలిగి ఉంది. ఒకే మిస్సైల్ అనేక వార్ హెడ్లను మోసుకెళ్లగలదు. ముఖ్యంగా ఈ క్షిపణి అమెరికాను లక్ష్యంగా చేసుకుని ప్రయోగించవచ్చు. ఐదేళ్ల సైనిక అభివృద్ధి లక్ష్యంలో భాగంగా ఈ క్షిపణుల్ని ఉత్తర కొరియా తయారు చేస్తోంది. ఇటీవల అక్కడి పార్లమెంట్‌లో కిమ్ ప్రసంగించాడు. తమ దేశం అణుసామర్థ్యం కలిగి ఉందని తెలిపారు. అమెరికా ప్రపంచవ్యాప్తంగా తీవ్రవాదాన్ని, ఘర్షణల్ని ప్రోత్సహిస్తోందన్నారు. తాజా మిస్సైల్ పరీక్ష దేశ సైనిక శక్తిని ఉన్నతంగా నిలపగలదని కిమ్ అన్నారు. ఇటీవలి కాలంలో ఉత్తర కొరియా ఖండాంతర క్షిపణుల్ని కూడా ప్రయోగించింది.


## రష్యా ఓడరేవుపై డ్రోన్‌లతో
# విరుచుకుపడ్డ ఉక్రెయిన్..!



**న్యూఢీల్లీ మార్చి 29 (నేటి దర్శిని):** ఉక్రెయిన్ తో యుద్ధంలో రష్యా కు మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. దేశ ఆర్థిక వ్యవస్థకు గుండెకాయలాంటి ఉస్త్-లుగా ఓడరేవుపై ఉక్రెయిన్ డ్రోన్లతో విరుచుకుపడింది. బాల్టిక్ సముద్ర తీరంలో ఉన్న ఈ పోర్టులోని గ్యాస్ టెర్మినల్‌పై జరిగిన దాడితో భారీగా మంటలు చెలరేగాయి. ఫలితంగా అక్కడి కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోయాయి.సెయింట్ పీటర్స్‌బర్గ్‌కు సమీపంలో ఉన్న ఉస్త్-లుగా పోర్టు రష్యా ఇంధన ఎగుమతులకు అత్యంత కీలకమైన కేంద్రం. ఐరోపా, ఆసియా దేశాలకు ఇక్కడి నుంచే అధిక మొత్తంలో చమురు, గ్యాస్ సరఫరా అవుతాయి. ఉక్రెయిన్ ప్రయోగించిన సుదూర శ్రేణి డ్రోన్‌లు రష్యా గగనతల రక్షణ వ్యవస్థలను దాటుకుని, నేరుగా గ్యాస్ నిల్వ ట్యాంకర్లను ఢీకొట్టాయి. దాంతో అక్కడ పెద్దఎత్తున అగ్నిప్రమాదం సంభవించి కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.రష్యా యుద్ధ సామర్థ్యాన్ని దెబ్బతీయడమే లక్ష్యంగా ఉక్రెయిన్ గత కొంతకాలంగా ఇలాంటి దాడులకు పాల్పడుతోంది. రష్యాలోని చమురు శుద్ధి కర్మాగారాలు, ఇంధన నిల్వ కేంద్రాలను ఉక్రెయిన్ లక్ష్యంగా చేసుకుంటోంది. తాజా దాడిలో చమురు శుద్ధి యంత్రాలు (ఫ్రాక్షనేషన్ టవర్లు) దెబ్బతినడంతో రష్యా ఎగుమతులపై తీవ్ర ప్రభావం పడుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ దాడిని రష్యా రక్షణ శాఖ ధృవీకరించింది. కొన్ని డ్రోన్‌లను కూల్చివేశామని అయితే మరికొన్ని లక్ష్యాన్ని ఛేదించాయని తెలిపింది. దీనిని ఒక 'ఉగ్రవాద చర్య' గా అభివర్ణించిన రష్యా తగిన ప్రతీకారం తీర్చుకుంటామని ఉక్రెయిన్‌ను హెచ్చరించింది.

# ఇజ్రాయిల్‌లోనూ యుద్ధ వ్యతిరేక నిరసనలు

- నెతన్యాహు, ట్రంప్‌పై ఆగ్రహం
- ఆందోళనకారులపై పోలీసుల బలప్రయోగం



**జెరూసలేం మార్చి 29 (నేటి దర్శిని):** యుద్ధ వ్యతిరేక నిరసనలు ఇజ్రాయిల్‌లోనూ ఉవ్వెత్తున ఎగిసిపడుతున్నాయి. శనివారం హబీమా స్క్వేర్ వద్దకు భారీసంఖ్యలో ఆందోళనకారులు తరలివచ్చారు. ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌లకు వ్యతిరేకంగా ప్లకార్డులు, నిరసనలతో హోరెత్తించారు. ఇజ్రాయిల్ పోలీసులు బలప్రయోగానికి దిగారు. నిరసనకారుల గుంపును చెదరగొట్టడానికి రెచ్చిపోయారు. బలవంతంగా కొందరు నిరసనకారులను అదుపులోకి తీసుకున్నారు. "మా గొంతు నొక్కినా.. యుద్ధ వ్యతిరేక నిరసనలు ఆపేదిలేదు" అని వారు స్పష్టం చేశారు. నెలరోజులుగా జనావాసాలపై దాడిచేసే అధికారం ఎవరిచ్చారంటూ ప్రశ్నించారు. అమాయకులను చంపేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.


## ఎర్రగా మారిన ఆకాశం..
## ఆస్ట్రేలియాలో అరుదైన ఘటన



**న్యూఢీల్లీ మార్చి 29 (నేటి దర్శిని):** ఆస్ట్రేలియాలో అరుదైన ప్రకృతి దృశ్యం ఆవిష్కృతమైంది. కాకపోతే, ఇది చాలామందిని భయపెట్టింది కూడా. పశ్చిమ ఆస్ట్రేలియాలోని కొన్ని ప్రాంతాలు పూర్తిగా ఎరుపు రంగులోకి మారిపోయాయి. అది కూడా బ్లడ్ రెడ్ కలర్. అచ్చం రక్తంలాగే ఎరుపు రంగులోకి వాతావరణం మారిపోవడంతో స్థానికులకు వింత అనుభవం ఎదురైంది.ఈ ఘటన శుక్రవారం ఆస్ట్రేలియాలోని డెన్‌హామ్ అనే టూరిస్ట్ పట్టణంతోపాటు షార్క్ బే, పిల్బారా ప్రాంతాల్లో జరిగింది. ఆకాశం పూర్తిగా రక్తపు ఎరుగు రంగులోకి మారిపోవడంతో ప్రతి దృశ్యం ఎర్రగానే కనిపించింది. నారెల్లె అనే ఉష్ణమండల సైక్లోన్ ప్రభావంతో ఇలా జరిగిందని వాతావరణ శాస్త్రవేత్తలు అంటున్నారు. ఇది తీర ప్రాంతం. తీరాన్ని నారెల్లె తుఫాన్ సమీపించిన సమయంలో గాలి ప్రభావానికి ఐరన్ కలిసిన దుమ్ము అంతటా వ్యాపించడం, మబ్బుల్ని కమ్ముకోవడం వల్ల, సూర్యకాంతి ప్రభావంతో అంతా ఎర్రగా మారింది. కాంతి వికిరణ చర్య ద్వారా ఇలా జరుగుతుందని నిపుణులు అంటున్నారు. ఈ కాంతిని నేరుగా చూసిన అక్కడి ప్రజలు ఆశ్చర్యానికి లోనయ్యారు.కొందరు ఆనందం వ్యక్తం చేస్తే, మరికొందరు భయందోళనకు గురయ్యారు. ఎప్పుడో కానీ, ఇలాంటి దృశ్యాన్ని తాము చూడలేమని చాలా మంది అన్నారు. భూమిపై కాకుండా ఏదో కొత్త లోకంలో ఉన్నట్లు అనిపించిందని అక్కడి వారు తెలిపారు. ఈ అరుదైన దృశ్యాన్ని తమ ఫోన్ కెమెరాల్లో బంధించి, సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో వైరల్‌గా మారాయి.

# మేమే ఉగ్రవాదులం

-- అమెరికా ఉగ్రవాద నిరోధక అధికారి



**వాషింగ్టన్ మార్చి 29 (నేటి దర్శిని):** ఇరాన్‌లోని మినాబ్‌లో బాలికల పాఠశాలపై క్షిపణి దాడి ప్రపంచ మనస్సాక్షిని దిగ్భ్రాంతికి గురి చేసిందని అమెరికా సైనిక మాజీ నిఘా, ఉగ్రవాద నిరోధక అధికారి జోసెఫిన్ గిల్బో తెలిపారు. అమెరికా పకడ్బందీగా ప్రణాళిక చేసి, ఉద్దేశపూర్వకంగా అమలు చేసిందన్నారు. 165 మంది బాలికలను బలిగొన్న ఈ దాడి ప్రమాదవశాత్తు జరగలేదని, పథకం ప్రకారం జరిపిన బాంబు దాడి అన్నారు. మనమే (అమెరికా) ప్రపంచంలోనే అతిపెద్ద ఉగ్రవాదులం. ప్రతినాయకులం" అని ఆమె వివరించారు.

## పెళ్లి భోజనంలో లెగ్
# పీసులు రాలేదని రచ్చ



**లక్నోమార్చి 29 (నేటి దర్శిని):** తమకు చికెన్ లెగ్ పీసులు అందలేదనే ఆరోపణలతో ఒక పెళ్లి రిసెప్షన్ సందర్భంగా పెళ్లి వేదిక వద్ద గ్యాంగ్ ఫైట్ జరిగింది. ఈ విషాద సంఘటన ఉత్తరప్రదేశ్‌లోని అమ్రోహాలో చోటుచేసుకుంది. పెళ్లికొడుకు కుటుంబం ఈ గొడవను ప్రారంభించింది. ఈ గొడవకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అవుతోంది. కొంతమంది టేబుల్ పైకి ఎక్కి పెద్ద బిర్యానీ గిన్నెల నుండి తమకు ఇష్టమైన ముక్కలను తింటూ కూడా వీడియోలో కనిపిస్తున్నారు. పెళ్లి రిసెప్షన్‌లో వడ్డించిన బిర్యానీలో చికెన్ లెగ్ పీసులు అందలేదని ఆరోపిస్తూ పెళ్లికొడుకు కుటుంబం గొడవ సృష్టించింది. పరిస్థితి విషమించడం చూసి, పెళ్లికూతురి కుటుంబం కూడా జోక్యం చేసుకుంది. దీంతో మాటల యుద్ధం పిడిగుద్దుల పోరాటానికి దారితీసింది. పెళ్లికొడుకుతో వచ్చిన వారు పెళ్లి రిసెప్షన్‌లోని కుర్చీలను, టేబుళ్లను ధ్వంసం చేశారు. చివరకు పోలీసులు వచ్చి పరిస్థితిని చక్కదిద్దారు.

## మంగోలియా ప్రధానమంత్రిగా న్యామ్-ఓసోర్



**ఉలాన్‌బాతర్ మార్చి 29 (నేటి దర్శిని):** అధికార మంగోలియన్ పీపుల్స్ పార్టీ ప్రస్తుత ఛైర్మన్ మరియు పార్లమెంట్ స్పీకర్ అయిన ఉక్రాల్ న్యామ్-ఓసోర్ మంగోలియా కొత్త ప్రధానమంత్రిగా నామినేట్ అయ్యారు. ప్రభుత్వ వార్తా సంస్థ మాంట్‌సెమ్ నివేదిక ప్రకారం, ఎంపీపీ సమావేశంలో ఏకగ్రీవంగా న్యామ్-ఓసోర్‌ను అభ్యర్థిగా ఎన్నుకున్నారు. గోంబోజావ్ సంతన్‌షట్టార్ రాజీనామాతో ఏర్పడిన ఖాళీని ఆయన భర్తీ చేస్తారు. కొత్త ప్రధానమంత్రి నాలుగు నెలల్లో పదవీ బాధ్యతలు స్వీకరిస్తారు.






# నాగార్జున జోడీగా?

'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రంతో తెలుగులో తొలిసారి బ్లాక్‌బస్టర్ సక్సెస్‌ను సాధించింది ఐశ్వర్యరాజేష్. ఈ సినిమా తర్వాత తెలుగులో ఈ భామకు అవకాశాలు బాగా వస్తాయనుకున్నారు. అయితే సినిమాల ఎంపికలో సెలెక్టివ్‌గా ఉండటం, తమిళంలో వరుస కమిట్‌మెంట్స్ వల్ల ఏడాదికాలంగా టాలీవుడ్‌కు దూరంగా ఉంటున్నది ఐశ్వర్యరాజేష్. తాజా సమాచారం ప్రకారం ఈ తెలుగందం తెలుగులో మరో బంపరాఫర్‌ను దక్కించుకున్నట్లు తెలిసింది. నాగార్జున వందో చిత్రంలో ఐశ్వర్యరాజేష్ కథానాయికగా ఖరారైందని ఫిల్మ్‌నగర్ టాక్. 'కింగ్100' అనే టైటిల్‌తో రూపొందుతున్న ఈ సినిమా శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్నది. రా.కార్తీక్ దర్శకత్వంలో యాక్షన్ కలబోసిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్నది. ఈ సినిమాలో కథానాయిక కోసం కొన్ని నెలలుగా అన్వేషణ జరుగుతున్నది. చివరగా చిత్రబృందం ఐశర్వరాజేష్ వైపు మొగ్గుచూపిందని చెబుతున్నారు. ఈ సినిమాలో సీనియర్ కథానాయిక టబు కీలక పాత్రలో కనిపించనుంది. త్వరలో 'కింగ్100' షూట్‌లో ఐశ్వర్యరాజేష్ జాయిన్ అవుతారని వార్తలొస్తున్నాయి. అయితే ఈ విషయంలో చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

## త్రినాధరావు నక్కిన మార్క్ స్టోరీతో 'అనకాపల్లి'..

### ఆకట్టుకుంటున్న టీజర్

యంగ్ అండ్ టాలెంటెడ్ నటుడు, నా పేరు సూర్య.. నా ఇల్లు ఇండియా ఫేమ్ విక్రమ్ సాహిదేవ్, సంధ్యా వశిష్ట, తారక్ పొన్నప్ప ప్రధాన పాత్రల్లో నటించిన తాజా చిత్రం 'అనకాపల్లి'. ఈ చిత్రం సమ్మర్ కానుకగా ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా తాజాగా టీజర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. టీజర్ చూస్తుంటే.. ఈ సినిమా ఒక ఇంటెన్స్ పల్లెటూరి యాక్షన్ డ్రామాగా తెరకెక్కినట్లు అర్థమవుతోంది. ఇందులో విక్రమ్ సాహిదేవ్ తన సరికొత్త లుక్ మరియు పవర్‌ఫుల్ యాక్టింగ్‌తో ఎంతగానో ఆకట్టుకున్నాడు. విక్రమ్‌తో పాటు సంధ్యా వశిష్ట, తారక్ పొన్నప్ప కీలక పాత్రల్లో నటించి సినిమాపై అంచనాలను భారీగా పెంచేశారు.ఈ సినిమా వెనుక టాలీవుడ్‌లో వరుస హిట్‌లతో దూసుకుపోతున్న ప్రముఖ దర్శకుడు త్రినాథరావు నక్కిన ఉండటం విశేషం. ఈ చిత్రానికి ఆయనే స్వయంగా కథ, స్క్రీన్‌ప్లే అందించగా, ఖగేష్ తమ్మినేని దర్శకత్వం వహించారు. నక్కిన నరేటివ్స్ మరియు భవ్య శ్రీ మూవీ మేకర్స్ బ్యానర్లపై త్రినాథరావు నక్కిన, నాయుడు కాండ్రేగుల సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. దీనికి డావ్‌జాండ్ అద్భుతమైన సంగీతాన్ని అందించారు. టీజర్ చివర్లో మేకర్స్ ప్రకటించినట్లుగా ఈ మూవీని 'సమ్మర్ 2026' కానుకగా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. టీజర్ చూసిన సినీ ప్రియులు ఈ సమ్మర్‌లో ఒక సాలిడ్ మాస్ ఎంటర్టైనర్ పడబోతోందని సోషల్ మీడియాలో కామెంట్లు పెడుతున్నారు.




## అఖిల్ 'లెనిన్'లో డబుల్ క్లైమాక్స్ ట్విస్ట్ ...

### ఏది ఫైనల్ అవుతుందోనని అందరిలో ఆసక్తి

యువ హీరో అక్కినేని అఖిల్ తన తాజా చిత్రం లెనిన్‌తో కెరీర్‌లో మంచి హిట్ అందుకోవాలని చూస్తున్నారు. దర్శకుడు మురళీ కిషోర్ అబ్బూరి (నందు) తెరకెక్కిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం షూటింగ్ దశలో ఉండగా, సినిమాకు సంబంధించిన ఒక ఆసక్తికరమైన విషయం బయటకు వచ్చింది. ఈ సినిమాలో రెండు వేర్వేరు క్లైమాక్స్‌లను చిత్రీకరిస్తున్నట్లు సమాచారం. మొదటి క్లైమాక్స్ పూర్తిగా మాస్ ఎలిమెంట్స్‌తో నిండిపోయి, హీరోయిజాన్ని ఎలివేట్ చేసే విధంగా ఉంటుందట. అభిమానులకు కావాల్సిన అన్ని కమర్షియల్ అంశాలు ఇందులో ఉంటాయని టాక్ వినిపిస్తోంది.ఇక రెండో క్లైమాక్స్ మాత్రం పూర్తిగా భిన్నంగా ఉండనుందని తెలుస్తోంది. కథలో ఊహించని ట్విస్ట్‌తో పాటు హీరో పాత్రలో గ్రే షేడ్ కనిపించేలా డిజైన్ చేశారట. ముఖ్యంగా హీరో తీసుకునే నిర్ణయం ప్రేక్షకులను ఆశ్చర్యానికి గురిచేస్తుందని, అదే సమయంలో ఈ ముగింపులో సీక్వెల్‌కు హింట్ కూడా ఉంటుందని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ఈ రెండు క్లైమాక్స్‌లలో చివరకు దేనిని ఫైనల్‌గా ఎంపిక చేస్తారో అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. టెస్ట్ స్క్రీనింగ్‌ల తర్వాత లేదా ప్రేక్షకుల అభిరుచిని బట్టి మేకర్స్ నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని సమాచారం. రాయలసీమ బ్యాక్‌డ్రాప్‌లో, ముఖ్యంగా చిత్తూరు ప్రాంతం నేపథ్యంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఇందులో హీరోయిన్‌గా భాగ్యశ్రీ బోర్సే నటిస్తోంది. అఖిల్-భాగ్యశ్రీ జంట మధ్య వచ్చే లవ్ సీన్స్ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని చెబుతున్నారు. ఇక ఈ సినిమాపై అఖిల్ భారీ ఆశలు పెట్టుకున్నాడు. గత చిత్రాల ఫలితాల నేపథ్యంలో ఈ ప్రాజెక్ట్ అతని కెరీర్‌కు కీలకంగా మారింది. సినిమా అవుట్‌పుట్ చాలా బాగా వస్తోందని యూనిట్ నమ్మకంగా చెబుతోంది. డబుల్ క్లైమాక్స్ కాన్సెప్ట్‌తో వస్తున్న 'లెనిన్' సినిమా అఖిల్‌కు బ్రేక్ ఇస్తుందా? లేక మరోసారి నిరాశ పరుస్తుందా? అన్నది తెలియాలంటే రిలీజ్ వరకు వేచి చూడాల్సిందే.



## చాలా హాట్‌గా, బోల్డ్‌గా..

### కాక్‌టెయిల్ 2పై కృతిసనన్ కామెంట్స్ వైరల్


తెలుగు ప్రేక్షకులకు పెద్దగా ఇంట్రడక్షన్ అవసరం లేని భామ కృతి సనన్ . మహేశ్ బాబు, నాగచైతన్య వంటి లీడింగ్ హీరోలతో నటించిన ఈ బ్యూటీ ప్రస్తుతం హిందీ సినిమాలపైనే ఎక్కువ ఫోకస్ పెట్టింది. కృతి సనన్ ప్రస్తుతం కాక్‌టెయిల్ 2 సినిమాలో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. రొమాంటిక్ కామెడీ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం జూన్ 19న గ్రాండ్‌గా విడుదల కానుంది.మోడ్రన్ లవ్, ఫ్రెండ్‌షిప్ నేపథ్యంలో రాబోతున్న ఈ చిత్రంలో తన పాత్ర తన కెరీర్‌లో ఇప్పటివరకు పోషించనివిధంగా చాలా హాటెస్ట్ అండ్ బోల్డ్‌గా సాగుతుందని చెబుతోంది కృతిసనన్. అంతేకాదు తన రోల్ ప్రేక్షకులను సర్‌ప్రైజ్ చేయడం ఖాయమంటోంది. ఈ మూవీలో రష్మిక మందన్నా, షాహిద్ కపూర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇందులో రష్మిక మందన్నా, కృతిసనన్ పార్ట్‌నర్స్‌గా కనిపించబోతుండగా.. ఈ కాంబో కథనాన్ని ఆసక్తికరంగా సాగేలా చేస్తుందట. తాజా టాక్ ప్రకారం ఈ ఇద్దరు ఫీ మేల్ స్టార్ల మధ్య వచ్చే సన్నివేశాలు చాలా బోల్డ్‌గా ఉండబోతున్నాయి. ఇదే నిజమైతే సిల్వర్ స్క్రీన్‌పై మరో ప్రయోగాత్మక సినిమాతో ప్రేక్షకులను థ్రిల్ అందించడం పక్కా అయిపోయినట్టే. హోమి అదంజనియా డైరెక్ట్ చేస్తున్న కాక్‌టెయిల్ 2 థీమ్, ప్రజెంటేషన్ చాలా బోల్డ్‌గా ఉండబోతుందని బీటౌన్ సర్కిల్ సమాచారం. డేరింగ్ స్టోరీ లైన్, స్టన్నింగ్ కాంబోలో వస్తున్న రాబోతున్న ఈ చిత్రంపై ఇప్పటికే అంచనాలు అమాంతం పెరిగిపోతున్నాయి.

## 'ఫౌజీ' విడుదల అప్పుడేనా?



అగ్ర కథానాయకుడు ప్రభాస్ నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రాల్లో 'ఫౌజీ' ఒకటి. హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామాలో నూతన నటి ఇమాన్వీ కథానాయిక. 400కోట్ల భారీ బడ్జెట్‌తో మైత్రీ మూవీమేకర్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్ ఆర్‌ఎఫ్‌సీలో శరవేగంగా జరుగుతున్నది. ప్రభాస్ లేని సన్నివేశాలను దర్శకుడు హను రాఘవపూడి చిత్రీకరిస్తున్నారు. ఇప్పటికే 70శాతం ఈ సినిమా చిత్రీకరణ పూర్తి చేసుకున్నది. ఇందులో ప్రభాస్ బ్రిటీష్ సైనికుడిగా నటిస్తున్న విషయం తెలిసిందే. బ్రిటీష్ కాలపు కథతో సాగే ఈ పీరియడ్ డ్రామాలో అద్భుతమైన ప్రేమకథ కూడా ఉంటుందనేది ఇన్‌సైడ్ టాక్. స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా ఆగస్ట్ 14న కానీ, లేక దసరాకు గానీ పానిండియా స్థాయిలో తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ, బెంగాలీ భాషల్లో ఈ సినిమాను విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. మిథున్ చక్రవర్తి, అనుపమ్‌ఖేర్, జయప్రద, భానుచందర్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: విశాల్ శేఖర్, నిర్మాతలు: నవీన్ యర్నేని, వై.రవిశంకర్‌ది

## పౌరాణిక దృశ్యకావ్యంగా 'మహాకాళి'




హను-మాన్'ఫేం ప్రశాంత్‌వర్మ సినిమాటిక్ యూనివర్స్ నుంచి వస్తున్న కాల్పనిక పౌరాణిక దృశ్యకావ్యం 'మహాకాళి'. ప్రశాంత్‌వర్మ షోరన్నర్‌గా, పూజా కొల్లూరు దర్శకత్వంలో రూపొందుతున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రానికి ఆర్కే దుగ్గల్, రివాజ్ రమేష్ దుగ్గల్ నిర్మాతలు. ఈ చిత్రం వందరోజుల షూటింగ్‌ను విజయవంతంగా పూర్తి చేసుకోగా, చివరి 40 రోజుల షెడ్యూల్ హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ఈ సినిమాలో శుక్రాచార్యుడిగా కీలక పాత్రను బాలీవుడ్ వెర్సటైల్ యాక్టర్ అక్షయ్‌ఖన్నా పోషిస్తున్న విషయం తెలిసిందే. రీసెంట్‌గా ఆయన.. తన భాగం చిత్రీకరణంతా పూర్తి చేశారు. మరోవైపు పలు స్టూడియోల్లో ఈ సినిమాకు సంబంధించిన వీఎఫ్‌ఎక్స్ పనులు జరుగుతున్నాయి. త్వరలోనే సినిమా విడుదల తేదీని ప్రకటించనున్నట్టు నిర్మాతలు శనివారం ప్రకటన విడుదల చేశారు. 'మహాకాళి'గా భూమిశెట్టి టైటిల్‌రోల్ పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సురేష్ రగుతు, సంగీతం: స్మరణ్‌సాయి, నిర్మాణం: RKD స్టూడియోస్

Published and Owned By Katta Hima Pavani Published at H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505. Printed at Smilys Online 6-7-48, Vanasthalipuram Shopping Complex, Ranga Reddy District, Telangana-500070, Editor: Katta Hima Pavani, PRGI NO: TGTEL/25/A0471, Phone: 94920 33365